

"దేశభాషలందు దెలుఁగు లెస్స."

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

పరాభవ - మార్గశీర్షపుష్యములు

సంపుటము 55

సంచిక 5

★

సంపాదకుఁడు

కవిమార్గస్య : కాకరపర్తి కృష్ణశాస్త్రి

ఆంధ్ర సాహిత్య పరిషత్ప్రచురణములు

అకారాద్యముద్రిత గ్రంథసూచిక	0-5
అమరుకము-జయంతి రామయ్యపంతులుగారు	1-2
అరవ దేశమునందలి ఆంధ్రవాఙ్మయము-	
ఆ. ఉమాకాంతముగారు	0-2
ఆర్యభాషావిభాగము	0-5
ఆంధ్రసాహిత్య పరిషద్వృత్తాంతము	0-5
ఈశానసంహిత	0-5
ఉత్తరరామచరిత్రము-జ. రా. పంతులు	2-5
ఉన్మాదసహస్రము (వెఱ్ఱివేయివిధములు)	
కొత్తపల్లి సూర్యారావు	0-7
కవిజనోజ్జీవని-సమస్యలు - శ్రీ కోటి రఘునాథతొండమాన్	0-5
కవిజనాశ్రయము	2-0
కాళిందీకన్యాపరిణయము-అహోబలపతి (ప్రథమ భాగము)	1-5
డిటో (ద్వితీయ భాగము)	0-7
చంపూరామాయణము (ఆంధ్రము) జ. రా, పంతులు	1-5
చాటుధారాచమత్కారసారః- (సంస్కృతము)	0-7
జ్ఞానప్రసూనాంబికాశతకము	0-2
జ్యోతిశ్శాస్త్రసారము-కపిస్థలం కృష్ణమాచార్యులుగారు	0-5
నమస్కారములు-కొత్తపల్లి సూర్యారావు	0-2
పరిషత్పుస్తకభాండాగారము 2 వ భాగము	1-0
,, 3 వ భాగము	1-0
ప్రాకృతభాషోత్పత్తి-	
శ్రీమాన్ మే. వెం. రమణాచార్యులుగారు	0-7



"దేశభాషలందు తెలుఁగు లెస్స"

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రిక

పరాభవ - మార్గశీర్షపుష్యములు

సంపుటము 55 సంచిక 5

సంపాదకుఁడు

కవిమూర్ధన్య: కాకరపర్తి కృష్ణశాస్త్రి

ఆంధ్ర సాహిత్య పరిషత్తు

ప్రతిష్ఠాపకులు :

ఆంధ్రభోజ, మహారాజ,

శ్రీ శ్రీ శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరువారు సి. బి. ఇ., డి. లిట్, పిఠాపురము మహారాజావారు.

శ్రీ శ్రీ శ్రీ వేంకటగిరి మహారాజావారు.

శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజావారు.

వ్యవస్థాపకులు :

శ్రీ జయంతి రామయ్యగారు

ఉద్ధారకులు :

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు,
జమీందారు, ఉయ్యూరు.

ఆంధ్ర సాహిత్య పరిషత్తు – కాకినాడ

అధ్యక్షులు

"విమర్శకాగ్రేసర" 'ఐతిహాసికసమ్రాట్'

శ్రీ బండారు తమ్మయ్యగారు.

ప్రధానకార్యదర్శి, కోశాధికారి

"అభినవభోజ"

శ్రీ దంటు భాస్కరరావుగారు

సహాయకార్యదర్శి :-

"కవిశిరోమణి", "ఉభయభాషాప్రవీణ" A

శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రిగారు

కార్యనిర్వాహక సభ్యులు :-

1. శ్రీ కోకా శివనాథశాస్త్రి గారు
2. "బాలవ్యాస" శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు
3. "భాషాప్రవీణ" "వ్యాకరణ విద్యాప్రవీణ"
   శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి గారు
4. "కవిమూర్ధన్య" "ప్రౌఢకవిచంద్ర"
   శ్రీ కాకరపర్తి కృష్ణశాస్త్రి గారు
5. శ్రీ కుందూరి ఈశ్వరదత్తు గారు (బి. ఏ)
6. శ్రీ జయంతి బుచ్చిరామశర్మ గారు
7. శ్రీ చిరువోలు కోటీశ్వరరావు గారు
8. శ్రీ దామెర రాజగోపాలరావుగారు, బి. ఏ.
9. శ్రీ వేదుల రామచంద్రకీర్తిగారు, (ఎమ్. ఏ. ఆనర్సు)
10. "సాహిత్యవిద్యాప్రవీణ" "ఉభయభాషాప్రవీణ"
    శ్రీ ఓలేటి సుబ్బరాయశాస్త్రి గారు
11. శ్రీ కావలి శ్రీరామమూర్తిగారు, (బి. ఏ. బి. ఎల్.)

విషయసూచిక

హరిహరదేవాయ నమః

సంక్రాంతి సంరంభము

శ్రీ కాశరపర్తి కృష్ణశాస్త్రి

సీ. బంతిపూవుదండల ద్వారాల తోరణ
గండ్లపై తోరణా ల్గట్టువారు
పెనుభోగిమంటకై పెద్దదుంగల దొంగి
లించి మూలల డాగురించువారు
క్రొత్తయల్లుని మెప్పుకోసమై వెలపెట్టి
మంచిబట్టలను గ్రయించువారు
కూఁతు నల్లుని దోడుకొనిరాగ వీలుకా
దాశౌచ మని యంగలార్చువారు

తే.గీ. భోగి బులిహోర, సంక్రాంతి బూరి, గారె
కనుమదినమున నని భావికార్యసరణి
బలుకువారలునై ముదంపడిరి జనులు
మకరసంక్రాంతి చేరువ మసలువేళ. 1

ఆ.వె. పేడ పచ్చమన్నుఁ బిసికి గోతుల మెత్తి
గోడ వెల్ల వైచి గుమ్మములకు
బసవు రాచి చుక్క లెసగ బెట్టిరి సతుల్
తరణి మకరరాశి కరుగు ననుచు. 2

శా. "తల్లీ! బిచ్చము వెట్టు మమ్మ!" యనుచుం
దండోపతండంబులై
పల్లెన్ బత్తనవీథి నర్థిజనముల్
వ్యాపించి త్రోఁపాడఁగా

పిల్లల్ జాలను అవ్వ వారిపయి వే
    వేంచేసి భైక్ష్యంబులం
దల్లుల్ పెట్టిరి సంతతిన్ గదుముచున్
    ధర్మంబు చాటించుచున్. 3

మ. వెలివెట్టెం గడు పెద్దకాపొకఁడు దా
    విరాసాల, లోలోన న
క్కలివేయంగ నహంకృతుల్ వనితలం
    గన్గొంచు వాల్జూపులన్
వలువుల్ ధాన్యము లిచ్చి గర్ణనిగ తన్
    భావించుచున్ గంగిరె
ద్దుల నాడించెడువారి కింద్రుఁడును జం
    ద్రుం డంచు వా రాడగన్. 4

ఉ. కట్టెదుటన్ వసించి సార
    కాయను బుగ్గలు పూరటింపగా
బిట్టుగ నూదుచున్ తెఱచి
    పేటిక మూతలఁ జేత మెల్లగా
నిట్టె యనన్ ఫణుల్ ప్రుధ ర
    హింపగ దోళల నిట్టనిల్చి వే
గొట్టె నరేంద్రునిం బడగ
    గొబ్బున విచ్చుచు ఫూత్కరించుచున్. 5

మ. "పలుకే యక్షిణి! పల్కు కాళీ! జగదం
    బా! పల్కవే శాంభవీ!
పలుకే" యంచును గేకరించి డమరుం
    బల్మారు వాయించుచున్

చలిలో వీనులు జెల్లవాఱుతటి స్వే
చ్ఛాచారిణియై వచ్చి సా
ఖిలివా డింటి లోసంగునైన గొని తా
వేంచేసి దీవించుచున్. 6

ఆ.వె. "క్రొత్తకోక గట్టుకొన్న యమ్మా" యంచు
పెద్దకేక పెట్టి వృద్ధమొక్క-
క్రింద గుడ్డ పఱచి కీచుగొంగుడు రాన
మేన రేగ గొమ్మదాసరయ్య. 7

సీ. దుర్గంధభరితమై తూటులుపడు పట్టు
పంచెను మోకాళ్ళపైకి గట్టి
అంచులు చినిగి వ్రేలాడు నీలపుచేల
మున గట్టిగా నడుమును బిగించి
పదలమ్మునుద్దచే ఫాలమ్ముపై నుద
రమ్ముపై నూర్ధ్వపుండ్రములు దీర్చి
కేకిపింఛ మొక్క కేల నాడించుచు
చిరుతల రెండవ చేత మీటి

ఆ.వె. పాడుపాటలోని ప్రత్యక్షరమునకు
నొత్తి లకుమ క్రార లుచ్చరించ
"బ్రెంధు సంఘినావు బ్రంధిఖానలో" యంచు
దివ్య చుట్టు దిరిగి తిరిగి దాసు. 8

మ. జనతల్ పైసల బ్రాతగుడ్డలను హా
ర్షం బూని వర్షింప, గా
విని పెన్నేటికి జెట్టి మోయు తనయా
లిన్ వేగ రా బిల్చుచున్
తనపార్శ్వం బుదరమ్ము దండలును చిం
దన్ రక్తమున్ మల్లికా

గ్జను డేతెంచెను త్రాటి బొదుకొను చా
ర్వుల్ నింగి బొంగారఁగన్. 9

తే.గీ. బుగ్గపై హత్తుచురకత్తి భూరిరుధిర
ధార నుమిసెడురీతి లాక్షారస మిడు
నెత్తిఁగోతలవాని గన్నెత్తి చూచి
గొల్లుమని యేడ్చి పాఱిరి పిల్లలెల్ల.

మ. తవణిల్లన్ మెడ వ్రేలుబిళ్ల నడిబా
టం గూలి డబ్బాటు క
న్గవ నెంతేనియు మోఁడ్చి కొట్టుకొనుచుం
గాంతామణుల్ జాలిమై
నవిరామమ్ముగ బోయ నీరమును హా!
హా! యంచు వేగ్రోలు కై
తవమూర్ఛానటు డైన యర్ధి కిడి ర
ర్ధం బన్నమున్ పుట్టముల్. 11

ఉ. "మా పొలిమేఱదిమ్మ యిదె,
మా పినతండ్రి క్రియించు మావిలే
తోఁపిదె, రాముకోవెల య
దో కుడివైపున—దాని చెంగటన్
మా పెదకాపుగారి భవ
న" మ్మని చెంగట నున్న భర్తకున్
జూపుచు నాగమించె నొక
సుందరి పండుగ కేడ్లబండిపై. 12

తే.గీ. విలువ యంతగ లేనట్టివలువ లొసగె
తనకు దా గన్నకొమరున కనుచు మివుల
బుగ్గల న్నొక్కుకొని మూతి ముడుచుకొనియె
క్రొత్తవియ్యపురాలు దా కోపగించి. 13

ఉత్తర రామాయణము

(తిక్కన- కంకంటి పాపరాజు)

శ్రీ ఆర్. అనంతపద్మనాభ రావు, బి. ఏ.

"శ్రీ మదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధన విధేయ తిక్కననామధేయ ప్రణీతం బయిన యుత్తర రామాయణమును,' విష్ణుమాయావిలాసాభిధాన యక్షగాననిర్మాణ ప్రవీణ తానిధాన పాపరాజప్రధాన ప్రణీతం బయిన శ్రీమదుత్తర రామాయణమును" నాంధ్రసాహిత్యమున విశిష్టస్థానము నాక్రమించుకొన్నవి. కవిత్రయమున శ్రేష్ఠుడయిన తిక్కనార్యుఁ డుత్తర రామాయణరచనాకాలమున కమలోదాత్త మనీష నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శిల్పమునందుపారగుఁడును కళావిదుఁడు నయినాఁడు. పాపరాజును శ్రీ మదనగోపాలలలిత కటాక్షమున విజ్ఞానవిభవవిజితసనందనుఁ డయినాడు. అప్పటికే విష్ణుమాయా విలాసయక్షగానకర్తయు నాయెను. కాన నిరువురును నుత్తర రామాయణకావ్యరచనాసమర్థులే యని చెప్పనొప్పును. అట్టిచో వారిరువురు నాకావ్యరచనమున నెంతటిప్రతిభను జూపిరో పరిశీలించుటే యీ నా యుద్దిష్టవ్యాసంగము.

13వ శతాబ్దివాఁ డగు తిక్కనామాత్యుఁడు- "ఏ నిన్ను మామ యనియెడు దానికిఁ దగ నిమ్మ భారతీకన్యక నాకీనర్హుఁడ వగుదని" మనుమభూపాలునిచే నభ్యర్థితుఁడై యుత్తర రామాయణరచన గావించి యతని కంకిత మొసఁగెను. పాపరాజో- "ప్రబంధ మొనర్ప శ్రీరఘూద్వహుని చరిత్రమున్ దొరకె- వాసిగ నీకృతిరత్న మేమహామహునకు సమర్పణసేయుదు నంచు నెమ్మది యోజనసేయుచున్న" ప్పుడు తన యిష్టదైవ మగు మదనగోపాలుఁడు స్వప్నమున గాన్పించి తన కంకిత మొసఁగ వలసినదిగా కోరినాఁడు. "దుహితకు భర్త నారయుజనున్ బలె యోజనసేయు" కవి యాస్వప్నవృత్తాంతమును తన సహశ్రోత

డైన పుష్పగిరి తిమ్మనాఖ్యకవిచంద్రునకుఁ జెప్పి; "కిరీటికి శౌరి తోడ యినయట్టు లమ్మహాకవి సాహాయ్య మాచరింప' గృతినొనర్పఁగ బూనినాఁడు. ఆదికవి యగు నన్నపార్యునకు నారాయణభట్టువలె నీతనికి పుష్పగిరి తిమ్మన సాహాయ్యుఁ డాయెను.

తిక్కన యుత్తరరామాయణ కావ్యరచనాకాలమునకు రంగనాథరామాయణము ప్రశస్తి నొందియుండెను. కొందఱు తిక్కన తాత యగు భాస్కరుని రామాయణమున కుత్తరభాగముగా నీగ్రంథమును రచించె నని భావింతురు. ఎట్లు తలఁచినను పూర్వరామాయణ మాకాలమునకు ప్రశస్తి నొందియుండె ననుట నిర్వివాదాంశము. తిరిగి, పూర్వరామాయణరచనకు తిక్కన యుద్యుక్తుఁడు గాలేదు. "ఎత్తఱి నైనను ధీరోదాత్తనృపోత్తముఁడు రామధరణీపతిసద్వృత్తమసంభావ్య మగుట నుత్తరరామాయణోక్తి యుక్తుఁడ నయితిన్" అని తనతలపును పొందుపఱచినాఁడు. మఱి పాపరాజేల యుత్తరరామాయణము తిరిగి రచింపఁ బూనుకొనె ననుట నాలోచింపవలయును.– తిక్కన నిర్వచనముగా రచించిన యుత్తరరామాయణమున కంతప్రశస్తి రాలేదు. తరువాతికాలమున కవులు ప్రజలు దాని నాదరింపలేదు. తిక్కనయుఁ దన తొలికావ్యమునుగూర్చి మహాభారతాంధ్రీకరణ సమయమున ప్రస్తావింపలేదు. అందులకు గారణమును నాతనిదృష్టిలో నంత ప్రముఖరచనముగా దోపకుండుటయే. అయినను కవిత్వదృష్టితోఁ జూచినప్పుడును, భారతరచనముతోఁ బోల్చినప్పుడును, తిక్కనగావించిన యీ మహత్తర కావ్యమునకు వన్నె తగ్గదు. ఈ పరిస్థితిలో 18వ శతాబ్దివాఁడగు కంకంటి పాపరాజు తిక్కనరచనను జూచి దాని కింకను మెఱుగుపెట్టి ప్రబంధముగా నొనరించి యుత్తరరామాయణమునకు ప్రశస్తిని గొనిరావలయు నని యత్నించి సఫలీకృతుఁ డాయెను. కావుననే యవతారికలో–

వరుసం దిక్కనయజ్వ నిర్వచనకావ్యంబై తగం జేసె ను
త్తరరామాయణ మందునన్ మఱి ప్రబంధం బూని నిర్మించుటే
సరసత్వం బని ప్రాజ్ఞులార నిరసించంబోకుడీ! రాఘవే
శ్వరు చారిత్రము లెంద ఱెన్ని గతులన్ వర్ణించినం గ్రాలదే!-
యని సమాధానము జెప్పినాఁడు.

ఉత్తర రామాయణరచనాకాలమునకు "నిర్వచనముగా గావ్యము రచించుట యాద్యుల రొప్పిద"మని తిక్కన తలఁచియుండెను కాని భారతాంధ్రీకరణసమయమున కాభ్రమ సరిగా దని తెలిసినది. అందులకు ముఖ్యకారణము తన రామాయణము ప్రజాదరణ మొంద కుండుటయే యయి యుండనోపును. కావుననే భారతాంధ్రీకరణమున్న "పద్యములన్ గద్యములన్ రచియింతెదన్ కృతుల్ అని పేర్కొని నాఁడు. అది తిక్కన తనప్రథమకావ్యమగుటచే గాఁబోలు దానిని సంపూర్ణముగా తీర్చిదిద్దవలసినభారము కంకంటి పాపరాజు వహింప వలసివచ్చెను.

తిక్కన తన యుత్తరరామాయణమున ప్రబంధలక్షణములను జూపినా డనియు, ఉత్తర రామాయణమును ప్రభంధముగా బరిగణింప వచ్చు ననియు, మద్గురువర్యులు (శ్రీ) పోలూరి హనుమజ్జానకీ రామ శర్మగారు నెల్లూరు మండలసర్వస్వమునందలి తమవ్యాసమున నిరూ పించిరి. అట్టిచో నిక పాపరాజు గావించిన గొప్ప యేమి యను ప్రశ్న ముదయింపక పోదుకాని, పాపరాజునకు తిక్కనపై గల యాదరాభి మానములచేతను, నుత్తర రామాయణమున కింకను బ్రశస్తి జేకూర్చుటకును తనకావ్యకళారీతులను వెల్లడించుటకును తిరిగియుత్తర రామాయణగాథను గ్రహించియుండును.

రెండుకావ్యములను బరిశీలించినచో ముఖ్యముగా గనిపించు నది గ్రంథవిస్తారము. తిక్కన– పది యాశ్వాసములలో– 1280 పద్య

ములలో కావ్యనిర్మాణము గావింపగా; పాపరా జెనిమిది యాశ్వాసములలో-3130- పద్యములను రచించినాడు. పాపరాజు గావించిన గ్రంథవిస్తారమునకు పూర్వరామాయణగాథ తార్కాణ. తిక్కన పూర్వరామాయణగాథను 22- పద్యములలో సంగ్రహముగా జెప్పగా పాపరాజు- 63- పద్యములలో పూర్వగాథను విస్తరించెను. తిక్కన శైలి లలితము గాగ పాపరాజు ప్రౌఢశైలిని కవనము గావించెను. తిక్కన ద్రాక్షాపాకమున రచింపగా, పాపరాజు నారికేళ పాకము నభిమానించెను. తిక్కనకు సంక్షిప్తతమక్కువ యెక్కువ. ఆయన పదములను తూచి తూచి ప్రయోగించును. కావుననే యాయన కొలఁదిపద్యములలో గొప్పభావమును వ్యక్తీకరింప గలిగెను. అట్లని పాపరాజు కృతిని లఘూకరింప యత్నించుటలేదు. ఒకటి రెండు ఘట్టములను పరిశీలించి యిరువురి కావ్యకళా వైదుష్యమును బరిశీలింతము :—

వేదవతినిఁ జూచి రావణుఁడు సంభాషించు ఘట్టము.

శంభునిచే సంభావితుఁ డయిన రావణుఁడు హిమవంతమునకేగి యొకచో నేకాంతమున గిరికన్యవలె తపంబునన్నున్న తపసికన్నె నొక్కతె జూచినాఁడు. చూచి కామాయత్తచిత్తుఁడై యాకన్యను బలుకరించినాఁడు ఆ నెలతయు నాపలుకులు తా వినియుఁ విననియదియు బోలె, నుచితవిధి నాతిథ్య మొసఁగినది. తాను హరిని బడయఁగా దప మొనరించుచుంట నని తనవృత్తాంతము నెఱిగించినది. ఇట- తిక్కన రావణునిచే- "యెఱఁగవుగాక భోగములకెల్లను నెచ్చెలి జవ్వనంబ యిత్తఱి ననిపింపగా, పాపరాజు- తపించె దూరకే కన్నెఱికంబు కాఱడవి గాచిన వెన్నెల జేసి యయ్యయో"- యనిపించి మఱికొంతయు" హరియన్నామము గప్పకున్ చెరయు నేల యీవృథా భ్రాంతి- యని పలికించెను. వేదవతి యాదుష్టుని ప్రవర్తనకుఁ గినిసి- "విశ్రవసుం

దలంచుకొని యాతిథ్యంబు గావించి మాగ్ఫలుకుల్ పల్కిన నింతయు గలిగె నన్నది. ఈఘట్టమున నిరువురును జక్కని పాత్రపోషణ గావించిరి.

రావణుఁడు వరుణునిపై దండెత్తి పోయి తిరిగి లంకకు బయనమై పుష్పకమున వచ్చుచు, లోకములోని స్త్రీలనెల్ల చెఱలువట్టె నని తిక్కన పేర్కొనెను. పాపరాజు మఱికొంతదూరము పోయి దివ్య విమానమున నచ్చురావణుడు-ఎలప్రాయంబుల్ చెల్వముల్ చతురతల్ హేలావిశేషంబులుం గల కన్యామణు లెవ్వరొక్కో-యని ప్రశ్నింపగా మహాపాశ్వప్రహస్తాది మూర్తు లారక్షోనాథున కిట్లు వివరించిరఁట ముదిమి యెన్నడు లేని కొదమ ప్రాయపు చెల్వు నేర్పులు వేల్పుగన్ని యల కమరు సొలుపుల జూపుల తళ్కుఁ జెక్కు లొయ్యారముల్ మనుజకన్యల కమరు మఱియు దక్కిన జాతులమందయాన లొఱవు లువహించి యుందురొక్కొక్కవగల వీరిలో మెచ్చువచ్చినవారి బట్టి తేవలయు నన్న నిందఱ తెత్తుననుచు నాఁరావణుఁడు పలికెనని వర్ణించి నాఁడు. ఇది పాపరాజు గావించినయూహ!

రంబారావణ సంవాదఘట్టము

కైలాసోద్యానమున విహరించు రావణుఁడు "నును వాల్గొవ్పుల బెళ్కు నెమ్మొగమునందు దెల్లమా తెల్వి గుల్కునడల్ సఖీహితోక్తుల పరాకున్ మీఱ నొక్కనిపై మేల్వాడి నేగురంభను జూచి "తోవకు నడ్డమయి నిలిచి తొయ్యలి కేల్గవఁ బట్టి నిల్వ" నేవేవో వదరినాఁడు. "తగదయ్యా దశకంఠ! వంశగుణ విద్యాశ్రీలఁబొకార్చు చేత గదయ్యా యిది తాల్మి నన్ విడిచి పెద్దల్ చన్నత్రోవన్ మెలంగి గురుత్వంబు వహింపవయ్య!" యని ప్రార్థించినది. ఉన్మత్తుడయిన రావణుఁ డామాటలు పెడచెవిబెట్టి బలిమిమై కాసిపనులు కావించి నాఁడు.

ఈఘట్టమున తిక్కన చూపిన కౌశల్యము రసౌచిత్యము గుర్తింప దగియున్నవి. రావణుని మాటలకు రోసిన రంభపల్కులు జూడుడు :- "నేను లంజియుం గావుడు వానితోడి, తమకంబది లంజియు గాదు"- అనమోదక విరస వచనములు పలికినది. అతఁడు వినియును విననిచెవులు సేసి యున్మత్తునిగతి లావు వెరవును మెఱయఁగా ననంగ క్రీడాసంగతి నెంగిలిగావించి, కారించి విడిచినాఁడు. పాపరాజీ ఘట్టమున కొంతరసౌచిత్యమును బాటింపలే దనియే పలువురు భావింతురు. రావణుఁ "డా బాలను కేలువట్టి చెంగల్వపాన్పు చేర గొనిపోయి కఠినరతుల నలంచినాఁడట. ఈఘట్టముననేగాక శృంగార వర్ణనలం దట నట పాపరాజు మితిమీరి వర్ణించెను. అది యాయన తప్పు గాదు. శృంగారలాలసతకు బుట్టినిల్లై "తాటాకులలోన వ్రాసిరి పరాంగనఁ గూడిన పాప మంచు" నని సిద్ధాంతీకరించిన, దక్షిణాంధ్ర వాఙ్మయప్రభావితుఁడగుటయే తప్పు. ఎట్లున్నను నాఘట్టమున, పాపరాజు రసౌచిత్యమును గోల్పోఁజేసెను.

ఈఘట్టముననే రంభ నలకూబరునికడ తనగోడు చెప్పుకొనునెడ తిక్కనను మీరి పాపరాజు వర్ణనగావించుట యుచితరీతి నుండుటయే కాక సమంజసము ననిపించును. రావణుఁడు గావించిన దుశ్చేష్టితమును జెప్పి- "పూనమె పోకముందఱన్, దెగువకుఁ జొత్తు నన్నఁగువిధిన్ విధిచేసె నమర్త్యకాంతగాన్" అని వాపోవును. అటు చనిపోవుటకును, వారినుండి తప్పించుకొనుటకును వీలులేకపోవుటను పాపరాజు చక్కగా చిత్రించెను.

రాఁబోవు కథాపరిణామమునకుఁ బూర్వసన్నివేశములను గావించిన సీతారాముల వనవిహార జలవిహారాదికము లగువర్ణనలను నిరువురును సంపూర్ణముగఁ జిత్రించిరి. అది యెంతయు సముచితముగా నున్నది.

రాముఁడు లక్ష్మణునివెంట సీత నడవికి బంపుఘట్టము.

లోకాపవాదమును వినిన శ్రీరాముఁడు సీత నడవులకుఁ బంప నిశ్చయించి, లక్ష్మణు నాకార్యమునకు నియోగించెను. మరుదినమున వారు బయలుదేరునపుడు రాముఁడు తన మనమున 'అడలడఁచికొని' అక్కడకు వచ్చినపుడు లక్ష్మణుఁడు "చిత్తమున ఖేద మండి, (అది) యానన మొందగా" సీత- అది చూచి వేఱొక విధమున భావించు నని తలఁచిన రాముఁడు—

"దూరమునాక ఘోరవన దుర్గతలంబుల గేలి సల్పఁగాఁ
గోరెడు భామలం బ్రియులఁ గోరినయట్టుల పుచ్చురాజులున్
ధారుణి నెందు గానమని తామును దీనికి నడ్డపెట్టి నే
బోరిత మాడి యిట్లు నినుబుచ్చుట కల్గినవాఁడు చూచితే"-

అని నెపము గప్పి మాటాడి నా డని తిక్కన చిత్రించెను. ఇది రాముని ధీరోదాత్తతను విల్లడించున దైనను, తన్ను నమ్మిన ధర్మపత్నిని మోసగించిన కపటచిత్తత యయినది. ఈఘట్టమున సీ యపవాదమునుండి రాముని తప్పించుటకై పాపరాజు యత్నించెను, ఆఘట్టమున రాముని ప్రవేశమునే జేయక, లక్ష్మణుని చిత్తవృత్తిని చక్కఁగాఁ జిత్రించి రసౌచిత్యమును, రామునిపాత్రకు విశిష్టతను గూర్చెను.

ఆ. వె. "ఏమి యెఱుఁగ దక్కట యీముగ్ధ
యనద జేసి యొంటినడవి ద్రోచి
యెటులవత్తు ననుచు నెడద దల్లడపడె
లలన యెఱుఁగకుండ లక్ష్మణుండు"

అని లక్ష్మణుని చిత్తవికారమును మాత్ర మెఱుకపఱచెను. ఇది సమంజసముగా నున్నది.

ఇట్లు ప్రతిఘట్టమునను తిక్కన రచనమును పాపరాజు రసో చితముగ ననుకరించియు, ననుసరించియు నెడనెడ నుచితానుచితము లనుగ్రహించి, పరిహరించియు, కొన్ని ఘట్టముల విస్తరించియు ప్రబంధ మును జక్కఁగా ఘటించెను.

తిక్కన కథను విషాదాంతము గావించుటకు మది నొల్లక రాముఁడు, సీత భూమిం గ్రుంగినపిమ్మట నగరమునకు వచ్చి కుశలవులతో సుఖముగాఁ గాలము గడిపె నని గ్రంథాంతము గావించినాఁడు. పాపరాజు ఆఘట్టము మిగుల నావశ్యక మను తలంపున రామనిర్యాణమును పరమపదవర్ణనమును గావించి యుత్తరరామాయణగాథను సంపూర్ణము గావించెను. విషాదాంత మగునను నెపము చక్కనిదిగా గాన్పింపదు. భారతమున స్వర్గారోహణపర్వమువలె కరుణరసోత్పాదక మగు రామనిర్యాణ ఘట్టము కథాగమనమున ప్రముఖ మయినది. అట్టిదానిని పరిహరించుట యుచితముగాదు. కావుననే పాపరాజు లోపమును పూరించెను. ఇట్లు తిక్కన, కంకంటి పాపరాజుల యుత్తరరామాయణకావ్యములను బరిశీలించినచో-తిక్కన యుత్తరరామాయణము నాధారముగాఁ గొని పాపరాజు ప్రబంధోచితరీతిలో ప్రౌఢ మగు వైదర్భీరీతిలో ప్రబంధసృష్టిం జేసి యుత్తరరామాయణమునకును, తనకును విశిష్టఖ్యాతిని సంపాదించెను.

పీష్వా బాజీరావు.

శ్రీ మోచర్ల రామకృష్ణకవి

జితకాశి ప్రథఁ గాంచె బల్లిదుఁడు బాజీరావు- ఢిల్లీ మొగల్
పృతనాధీశుల గుండె గాలమయి నర్తించెన్- మహారాష్ట్ర భూ
పతి సామ్రాజ్యము పెంపు సేయఁ గలిగెన్- బుందేల్మహీఖండ
విస్తృతిలో మూఁడవపాలు గైకొనియెఁ దత్పృథ్వీశు సఖ్యమ్మునన్. 1
అలహాబాదు మొగల్ నబాబు తనపై నాటోపముం జూప, నం
చెలుగా సేనలఁ దీర్చినం బిలిచె బాజీరాయనిం దోడు బుం
దెలఖండేశుఁడు ఛత్రసాలుఁ, డనురక్తిన్ వాహినీయుక్తుఁడై
చెలికాఁడై చని ఛత్రసాలు నల బాజీరావు గెల్పించెఁ దాన్. 2

తన కీతెఱఁగున విజయము నొనఁగూర్చిన వాని కొసఁగె నలుపాగ్ర-
న్ననఁ బ్రాగుక్తము స్వీయావనిభాగము ఛత్రసాల వసుధేశ్వరుఁడున్ 3

ఇంతే కా దల ఛత్రసాల విపులాధీశుండు ప్రేమస్ఫుట
స్వాంతన్ స్వీయమహమ్మదీయవనితాజాతన్ సుతన్ గన్నియన్
గాంతారత్నము నిచ్చె బాజికి నుపగ్రాహ్యమ్ముగా నాతఁ డెం
తెంతో వేడుకతోడ నారమణితో నేగెన్ స్వదేశానకున్. 4

ఆకొమరియారి నామధేయము మస్తాని గాని మార్చునందె దాని పేరు-
బాజీరావు రాణివాసమై యెసఁగి యాసుందరదన 'మంజుఘోష'
యయ్యె. 5

మింటిమీఁదఁ దళుక్కున మెఱసిపోవ
యలరు సౌదామనీవల్లి యనఁగ నవని
మీఱు నా మించుఁబోణి శరీరయష్టి-
పోల రాపెను వేలుపుంబోలఁతు లైన. 6

చందమామలోని చల్లఁదనంబును
సారసములలోని సౌరభంబుఁ
దీసి వడియఁగట్టి పోసి చేసెనో ధాత
యనఁగ నింపులీను నామె మోము. 7

ఆ మనోజ్ఞవదన యందంబుతో వియ్య
మందఁగలిగె మాటపొందికయును
జూడఁ జూడ మాటలాడఁగాఁ జవు లూరఁ
జేయు నామె పల్కు సోయగంబు. 8

కోమలము లగు మావిచిగుళ్ళు మేసి,
కొసరి కో యని కూయుపుంస్కోకిలమ్ము
లామె గొం తెత్తినంతనే యంబరమున,
కెగిరి పోవును సిగ్గుతో మొగము వంచి. 9

వేణు వూదఁగలదు, వీణియ వాయింపఁ
గలదు, నాట్య మాడఁగలదు కలికి,
భరతశాస్త్ర గానసరణియందుఁ బ్రవీణ,
మేటి యా 'గవాయి' పాటలోన. 10

అట్టిది మంజుఘోష, తన కబ్బెను, దానొ శుభాంగలక్ష్మికిం
బుట్టిన యిల్లనందగిన పూరుషమూర్తి, రసానుకూల మా
ఘట్టము సంఘటిల్లె, గృతికర్త సమర్థుఁ డొకండు గల్గుచో
ఎట్టి యహీనకావ్యము మహిస్థలిలో వెలయించునో కదా! 11

కల దాబాజీరాయని కెలదోఁట యొకండు. సకలవృక్షములకు సూ
నలతా జాతుల కయ్యది నిలయంబై నందనవని నెత్తిఁ దలదన్నున్. 12

ఆ యుద్యానపు మధ్యభాగమున రమ్యంబైన హర్మ్యంబు, శి
ల్పాయత్త ప్రతిభావినిర్మిత మనల్పాలేఖ్యసౌందర్యశో
భాయుక్తిం దనరారు నొక్కటి; విసుర్వ్యాఖం డభిజ్ఞుండు బా
జీ యద్దానిని మంజుఘోషనెలవై చెల్వారఁ జేసె వెసన్. 13

అవి మధుమాసపున్ దినము లబ్బురపుం దమి గుబ్బతిల్లఁగా
జివురు మెఱుంగుపట్టునునుచీరను మేన ధరించి, యెంతయున్
నవకపుఁగాంతు లీను సుమనస్తతి వేసలిఁ గీలుకొల్పి, త
త్పవిహిత మైన సౌరభముతో వనలక్ష్మి తనర్చె నత్తఱిఁ. 14

పూవుఁదేనెలఁ గడుపారఁ ద్రావి త్రావి
సోగుమ్మలై బంభరములు ఝంఝుమ్మటంచు
లతల విహరించెఁ గాకలీరుతము లలరఁ
బలికెఁ జిలుకలు గోరువంకలు చెలంగ. 15

సంభావ్యచైత్రరథ శుభసంభారము నాను రంభసవురున, లీలా
సంభృతజీవిత విహా సంరంభముతో మంజుఘోష ప్రారంభించెన్. 16

నాథు ప్రణయవనధి నడిరేయి కడచినదనుక మునిఁగి తేలి, దరికిఁ జేరి, కూర్కి, రమణు నేలుకొల్పును బ్రత్యూషమున నె మురళిగానమున నెలంత. 17

హయము నెక్కి యేగు దయితుని వెనువెంట
నొక్క కత్తలాని నెక్కి తాను
పురుషవేష మూని పోయివచ్చు వయాళి
యామడలకొలంది యామ వెలంది. 18

వచ్చి పన్నీటఁ దోఁగి, యాప్యాయమంది,
కట్టి తోడి పూసి రుచులీను బొట్టు లూని,
మిసిమిచిఱుదిండ్లు దిని, ఫలరసము లాని,
యరుగుదురు వారు మందిరోద్యానమునకు. 19

ఫలసంపత్కదళీతతుల్ గల వనద్వారంబునం జిల్కబా
రుల కల్యాణపుఁ బచ్చతోరణములీరున్ సారె వీక్షించి, రం
జిలుచున్ బూఁబొదరిండ్ల కేగుదురు బాజీమంజుఘోషల్ లతా
లలితాంగుల్ గుసుమాక్షతల్ జివురుఁ గేళ్ళన్ గొల్లఁగాఁ జల్లఁగన్ 20
పుష్పాడిబాటలన్ నడచి పోదురు వారు మరందవాహినుల్
గుప్పున దాటుచున్ మధురకూజితముల్ విని సొక్కి సోలుచున్
గుప్పన గూరగా నుడుతకోఱలగంట్లకుఁ జట్టుప్రక్కలన్
జిప్పిలు నారికేళజలశీకరపాళులఁ దొప్పదోఁగుచున్. 21

వ॥ ఒక్కనాఁ డీ చందంబున మందయానంబునఁ బ్రమదావనంబునఁ బ్రవర్తిల్లునెడ. 22

ముందు మిగిలె విభుఁడు, పూలుగోయుచు మంజు
ఘోష నిలిచె నొక నికుంజమునకు
నికటమందు భ్రమర మొకటి తన్ముఖసరో
జమ్ముఁ గ్రమ్మెఁ బరిమళమ్ముఁ గోరి. 23

వెంట లేదిదేమి వెలది యందుఁ బ్రియుండు
తిరిగి చూడ, బోటి తేఁటియగుచు
వదలిపోవఁ గేలు మెదలింప నదికల్వ
కంటి కన్నుఁదోయిఁ గవియవచ్చె. 24

చిదిమినపూలు పయ్యెదపసిండి చెఱంగున సంగ్రహించి, య
య్యది తన డాకయిక్ హోయలు హత్త వహించి, దృగంచలంబులన్
బొదివిన చంచరీక ముడివోఁ గుడికై పువుతో విదిల్చినన్
గుదికొనె నానెలంత కనుగోల్కులయందుఁ బరాగపాంసువుల్ 25

అరసి సంభ్రమించి యరుదెంచి చెంతకుఁ
జేర్చుకొని కపోలసీమ నిమిరి
బుజ్జగించు వల్లభుని సల్లలితబాహు
పంజరమున వ్రాలె మంజుఘోష. 26

అంగుళులన్ మనోరమముఁ డంగన తొంగలిఱెప్ప లెత్తి క
న్నుంగవ రాలినట్టి సుమనోరజమున్ వదనానిలమ్ముచే
తం గడవెళ్ళఁ జేసినను దన్వి పరాగపులేశ మున్న దం
చుం గనిపట్టుఁ జూడుఁ డనుచుం బొడిచెన్ బ్రియుఁ డా నురమ్మునన్

ప్రబల వక్షోరుహప్రహారముల శిక్ష
ననుభవించినవాఁ డని కనికరించి,
ప్రేయసుని కేలు పట్టి కొంపోయి యొకర
సాలతరుశాఖ వ్రేలునుయ్యాల నుంచి 28

కమలనయన వసంతరాగమున నొక్క-
పాట పల్లవితో నూచెఁ బ్రాణవిభుని
స్థాణువులు పల్లవింప వృక్షముల యూల
వాలముల చంద్రకాంత రత్నాలు కరఁగ. 29

ఆనందంబున వార లీసరణి డోలాందోళనక్రీడలో
మేనుల్ మానసముల్ విలీన మయి శోభింపఁగ వినోదించి, లీ
లానీకాళవిలాసముల్ వెలయఁ గేళాకూళిలో హాయిగా
స్నానాదుల్ పచరించి, సౌధ మనుహొందం జేరి విశ్రాంతులై. 30

బహువిధవ్యంజనాంచితభక్ష్యభోజ్య
ములు సుధాసమపానీయములును దనరు
భోజనమ్ము లొనర్చి యప్పురుషవరుఁడు
గాంతయును గేళిమందిరాభ్యంతరమున. 31

కమనీయ భావ మొక్కటి వల్లభుం డీయ,
మధురపద్యము వ్రాయు మంజుఘోష,
ప్రేయసి యర్థ మర్థించిన వ్యాసఘ
ట్టం బొందు ప్రియుఁడు స్పష్టం బొనర్చు
సఖుఁ డొక సన్నివేశంబు వర్ణింప నా
దృశ్యంబు లలన చిత్రించి యిచ్చుఁ
బ్రాణేశుఁ డొక యంగహారంబు పేర్కొన
నంగన యానాట్యభంగి చూపు.

మగువ యొకగ్రంథముం గొని మంచిపట్టు
వెదకి ప్రత్యక్షశయ్యలోఁ జదువ, సమ్మ
దమున వినిపించుఁ గావ్యఘట్టములు విభుఁడు
సతికిఁ బాంచాల బాహాట శయ్యలందు. 32

కాల మిట్లు వారు గడుపుచుండఁగ నొక్క
వాసరమున దెల్లవాఱువేళ
సేవకుం డొకండు చేరవచ్చె నమంద
గమనమూని తన్నికార్యమునకు. 33

మొగ సాలలేచి, బాజీయుగపాటు లభింప నతని యంతికమునకున్
దగ నడకువమైఁ జని, కరయుగము న్ముకుళించి నేరు పుల్లసిలంగన్. 34

అరగడియ సేపు మాటాడి యరుగుమయ్య
యనుచు సెలవిచ్చి పంపినా రమ్మగారు
దేవరా! యాజ్ఞ పాలించితిని, మనస్క-
రించి మీరిచ్చునాన ధరింతుఁ దలను. 35

అని పలికినవిని బాజీ
'చని విన్నప మాచరింపు జనయిత్రికిఁ గ్ర
న్నన వచ్చెద నిదె' యనఁ గై
కొనె సెలవున్ వీడె సేవకుఁడు మందిరమున్. 36

పిమ్మట బాజీరాయం
డమ్మ గృహంబునకుఁబోయి యామె పదాంభో
జమ్ములకు మ్రొక్కి వినయభ
యమ్ములు భక్తియును భావమం దనువారన్. 37

'ఏమి సెలవు తల్లి! సేమమే కద నీకు?
వచ్చినాఁడ నీదు పనుపు సేయ
ననుడుఁ గుశలమడిగి యమ్మ రాధాబాయి
యనుఁగు సుతునితోడ ననియె నిట్లు. 38

'వృద్ధురాలనైతి నింక నేఁ బెక్కేండ్లు నిలువఁబోను ధారుణీతలమునఁ
బుణ్యతీర్థములకుఁబోయి సేవించుకోవలయునన్న తలఁపు గలిగెనాకు. 39

నాయీకోరిక తెలియంజేయ న్నిను బిలువనంపి చెప్పితినోయీ
నాయన! నీమదికెక్కిన చాయఁ గర్తవ్యమీవు జరుపంబోలున్. 40

నావిని తనయుఁడు 'తల్లీ! నీ వాంఛాపూర్తి నేను నెఱపఁజేతున్
పావనతీర్థములెల్లన్ సేవింపఁగలవు నీ వచిరకాలములోన్.' 41

అని వచించి జనని యనుమతిఁ గొనిపోయి,
కులపురోహితులను బిలువఁ బనిచి,
తీర్థయాత్ర కరుగ దివ్యముహూర్త మే
ర్పఱుపఁ జేసె బాజీ వారిచేత. 42

వలసిన వస్తుజాతములు వాటపు గొల్లెన బండ్లమీఁద, నొం
టెలపయి వేసడాలపయి నిండి బయల్వెడలెన్; భటావళుల్
గొలువుదు కొంద్రు వాహనములన్ శకటమ్ములు నెక్కి ముందుగా
వెలలిరి; పల్లకీలపయి వెల్వడి రింతులు తీర్థయాత్రకై. 43

ఉదయపురముఁ జేరి తదుపరి జయపురమరిగి మధుర కేగి యందు హరిని
గొలిచి యచటినుండి యలకురుక్షేత్రమ్ముఁ జూచి యచోటునాసి మనథ
మూని 44

పాపఘ్నులైన గంగాద్వీపవతిం దగ సరస్వతీకాళిందుల్
సావహ్నవవీచికలం జూపి కవుంగిట గదించు సంచుఁ గని తేమిన్. 45
తనరఁ ద్రివేణీసంగమమున రాధాబాయి స్నానముం గావించెన్
జననము చరితార్థంబయ్యె నటంచు మదిం దలంచి తృప్తిం గనియెన్. 46
చేయుదు రాప్లావంబులు హాయిగఁ దైర్థికులు గతథ వార్జితదురితా
ధ్యాయసమాప్తిం గాంతురు, శ్రేయః పదముం గడింత్రు చేగ
ప్రయాగన్. 47

వారు ప్రయాగనుండి భవబంధవినాశికి వారణాసికిన్
జేరిరి; జాహ్నవీరుచిరనిర్మలశర్మదవారిఁ దోగి, సం
సారమలంబువాసి, స్మరసంహరు శంకరు విశ్వనాథు దు
ర్గారమణున్ భజించుకుతుకమ్మునఁ గోవెల కేగి రెల్లరున్. 48
నందనుండు ముందునడువ రాధాబాయి నడచిపోయె విశ్వనాథునికి
దేవదేవుఁ జూడఁ బోవుచో నెవరైనఁ బాదచారులగు టెకాదె తగవు! 49

దేవళముచుట్టు ముమ్మాఱుతిరిగి, లోనికరిగి, విధ్యుక్తరీతి రుద్రాభిషేక
ములను గావించి యర్చించి పుణ్యహేతువులు మహేశ్వర నిర్మాల్య
ములు ధరించి. 50

శివునిటు బాజీరాయుం డవిరళభక్తి ప్రపత్తులమర నుతించెన్
భువి నట్టివాని కీ భక్తివిశేషము విశ్వనాథు కృపఫల మేమో! 51
“గంగామంగళభంగసంఘరుచిరంగచ్చంద్రికాంచజ్జటా
శృంగారుండవె, వైన మేన గిరిపుత్రిం దాల్చియున్నావు; నె
య్యుంగా శౌరిని జూచువాఁడ వటులయ్యున్ దత్సుతున్మారు ద
గ్ధాంగుం జేయక పోవలేదుగద దేవా! కాశికావల్లభా! 52
కాశికావల్లభుఁడవైనఁగానిబుధులు తొడరికొల్చెడివిశ్వనాథుఁడవుగావె!
నీవు లేనిది పాలింపనిది సమస్తలోకములయందు లేదు పినాకపాణి. 53

హాలహాల మబ్ధిలోనుండి యవతరించినపుడు
గగ్గోలుపడిపాఱి రఖిల సురులు ;
విషము కంఠాన దాచి యీవిశ్వమెల్లఁ
బ్రోవగలిగిన దేవుఁడవీవె స్వామి! 54

త్రైలోక్యపురారంభపు మూల స్తంభంబ వష్టమూర్తివి- మముఁబోల్
బాలిశులకు నీ మర్మము నీలలియుం దెలియవచ్చునే విశ్వపతీ! 55

విశ్వమున కీశ్వరుండవు శాశ్వతుఁడవు
కలవు నీయందు బ్రహ్మాండములు శివుఁడవు
భువనమయుఁడవు నిస్సంగుఁడవు నిరంజ
నుఁడవు నిర్గుణుఁడవ కారణుఁడవు దేవ! 56

నేనెవండనో తెలియంగలేనివాఁడ,
నిన్ను నీ తత్త్వముంగూర్చి నేనునిర్ణ
యింపఁబూనుట నగుబాటె యేది యెట్టు
లుండినను నాకు విశ్వనాథుండె గురుఁడు. 57

అని నుతించి బాజి జననితో నన్నపూర్ణాలయమునకరిగి యామెపూజ
పరఁగ జరిపి, కాలభైరవాలయమున నర్చనాదికంబు లమరఁ జేసి. 58

పితృదేవతలకు శ్రద్ధాన్వితుండై పిండప్రదాన విధులొనరిచి, స
మ్మతి గయకుఁజేరి యచటన్ పితృశ్రాద్ధాదికములు నిర్వర్తించెన్. 59

పౌనఃపునిటు తీర్థయాత్ర సంపూర్తి చేసి
కొని కృతార్థత చేకూర్చుకొన్న జనని
తోడ బాజీ మహామంత్రి వీడు చేరి
రాజకార్యములందు నిమగ్నుఁడయ్యె. 60

(సశేషము)

"ఆంధ్ర శిల్ప కళామతల్లి అమరావతి అచ్చటి ఖననపరిశోధనలు"

శ్రీ ఇంగువ కార్తికేయశర్మ

ప్రథమభాగము :-

పవిత్ర మగుకృష్ణానది యెన్నియుగాలనుండియో తనతీరాన జీవించుచున్న మానవునికి చేయూత నిచ్చుచుప్రవహించు చున్నది. ఈ తీరమునంతను పురాతననగరము లెన్నో బౌద్ధపుణ్యక్షేత్రములు శిల్ప కళాకేంద్రములు షుమారు క్రీ॥ పూ॥ 3 వ శతాబ్దమునుండి క్రీ॥ శ 5వ శతాబ్దమువరకును నత్యంతవైభవోపేతముగ విరాజిల్లుచుండెడివి. స్వదేశీయులేకాక విదేశీయులుకూడ వాటిదర్శనభాగ్యమునకై యవి రామముగ వచ్చుచుండిరి. ఆవిదేశీయులలోని కొందరు విజ్ఞులు మన కెన్నొవిషయముల తెలియబరచినారు. ఈవచ్చినవారిలో మెగాస్థనీసు (క్రీ॥ పూ॥ 300), ప్లినీ (క్రీ॥ శ॥ 77), టాలోమి క్రీ॥ శ॥ 140), హ్యూయన్ త్సాంగ్ (క్రీ॥ శ॥ 700), ఇట్సింగ్ మొదలగువారు గావించినరచనలద్వారా యాంధ్రదేశపుచరిత్ర దానివిశిష్టత చాలవరకు తెలియుచున్నది.

1. పాశ్చాత్యుల పరిశోధనలు : వాటి పరిణామము

అటువంటి మహాక్షేత్రములలో గుంటూరుసమీపమున నున్న యమరావతి యత్యంతప్రాముఖ్య మైనది. ప్రస్తుత మీచారిత్రకశిథిలము లున్నగుట్టను "దీపాలదిన్నె"యని పిలుచుచున్నారు. 1797లో కలనల్ మెకంజీ యనుభూశాస్త్రవేత్త యిచ్చట స్థూపశిథిలములను కొన్నింటిని చూచుట తటస్థించెను. అప్పటికే యీప్రాంతపు జమీందారగు రాజా వాశిరెడ్డి వెంకటాద్రినాయు డనుమహాశయు డాప్రాంతమునంతను నిటుకలనిమిత్తమై త్రవ్వకములను సాగించి, శిథిలము లై యున్నకట్టడముల నన్నింటిని నాశము గావించెను. దానిప్రాముఖ్యతను గుర్తించిన మ్యాకంజీదొర తిరిగి 1816లో పలువురు యూరోపియను శాస్త్రవేత్తలతోడికొనివచ్చి ముక్కలై పోయిన యీశిల్పావశేషములను సాధ్యమగునంతవరకు చిత్రించుటయేకాక, కొన్నింటిని కలకత్తాలోని "బెంగాల్ ఏషియాటిక్ సొసైటి" మ్యూజియమునకు తరలించివైచెను. ఆతర్వాత 1830, 1845, 1881, 1890 లలో పలువురు యూరోపియన్ విజ్ఞానవేత్త లనర్గళ మగుకృషి చేసి యీస్తూపము చుట్టుప్రక్కల ప్రాంతముల త్రవ్వకము గావించి షుమారు ఒక వేయికి పైగ శిల్పశిలాఖండాలను మనదేశములోని ముఖ్యమైన పురావస్తు భండాగారములకు, బ్రిటిష్, జెర్మనీ, పారిస్, అమెరికాలోని భండాగారములలోనికి పంపివైచిరి. ఒక్క "బ్రిటిష్ మ్యూజియం" లోనే దాదాపు 121 శిల్పాలను చూడవచ్చు. ఇవి "ఎలియట్ మార్బల్స్" అని పిలువబడుచు ప్రథమప్రాంగణములో చూడవచ్చినవారిని తన్మయులను చేయుచున్నవి. సర్వపండితులగౌరవమును చూరగొనుచు పూజింపబడుచున్నవి.

2. 1960 - 64 నాటి ఖననపరిశోధనలు

ఈవిధముగ నీస్థలము పలుమార్లు త్రవ్వబడి రూపురేఖలు

నశించి శిల్పావశేషములను కోల్పోయి చూడవచ్చినవారి కత్యంత విషాదకర మైనస్థలముగ కనుపించుచుండెను. శిల్పావశేషములను కొన్నింటిని మాత్రము ఒక రేకుల కుటీరములో పదిలపరచియుండిరి. ఇట్లుండగా 1958–1960 లలో నాగార్జునకొండ త్రవ్వకాలకు ప్రతినిధి యగు డాక్టరు రాలిప్రోలు సుబ్రహ్మణ్యంగారు అమరావతిని నక్కడి శిథిలావశేషము లున్నస్థలములను కడుజాగ్రత్తతో పునః పరిశీలించి యవసరమగు ముఖ్యస్థలములందు కొంత త్రవ్వకములుకూడ కొన సాగించిరి. (Indian Archaeology, 1958-59 Review, P. 5 PLS I and II). శిథిల స్తూపముయొక్క బేసిమట్టము నాధారముగ తీసికొని కొంతవరకు దానిని పూర్వాకృతికి కట్టించిరి (చూడుడు ఛాయా చిత్రము-1). వీరిత్రవ్వకమువల్లనే యీబౌద్ధస్తూపావశేషము లున్న ప్రదేశము చరిత్ర మరికొంతవిశదముగా తెలియవచ్చినది.

అట్లుతిరిగిపూర్వాకృతికికట్టుటచే, స్తూపముయొక్కపరిధి 168 అడుగులని రుజు వగుచున్నది. ప్రదక్షిణ పథము 11 అడుగులు వెడల్పు కలిగి విశాలమై యుండెడిది. అశోకుని శిలాస్తంభ శాసనమునకు సంబంధించిన ముక్కలు పునాదులలోను, చుట్టుపట్లను లభ్యమగుటచే దీనిని మొట్ట మొదట క్రీ॥ పూ॥ 3 వ శతాబ్దమున కట్టియుందురని ధృఢపడుచున్నది. బహుశః అశోకచక్రవర్తియే కట్టియుండవచ్చు నని పైవిజ్ఞాని యభిప్రాయము. శ్రీ సుబ్రహ్మణ్యంగారి పరిశోధనలలో బయల్పడిన 5-అమూల్య మగు స్వచ్ఛమైన రాతిస్ఫటికముచే తయారు చేయబడిన స్తూపాకారపు భరిణలు (చూడుడు ఛాయాచిత్రము – 2) అపూర్వములు. ఇవి తూర్పుదిక్కున నార్యకకంభము లుంచబడిన పటముక్రింది భాగమున పొడుగుపాటి చక్కనిరాతిలో 5-సమభాగములలో వరుసగా నమర్చిన గుంటలలో నిముడ్చబడి యుండెను. వానిపై యథాప్రకారము స్తూపకట్టడ ముండెడిది. మన యదృష్టవశాత్తు నివి 1876, 1881, 1890 లలో త్రవ్విన సివెల్ బర్గెస్ అలెగ్జాండర్ రీ

మొదలగు పురాతత్వవేత్తలకంట బడలేదు. వీనిలో (ఛాయాచిత్రము-2) మధ్యభాగమున నున్న భరిణలో నొకచిన్న యెముక, బంగారు తాయత్తు బంగారుపుష్పములు, నుంచబడినవి. మిగిలినయన్నింటిలోను బంగారు పుష్పములు బూడిద విలువైనరత్నములు నున్నవి. ఇదివరలో పండితు లూహించినట్లు యీస్తూపము బుద్ధభగవానుని యస్థికలపైననే నిర్మింపబడిన దని నిశ్శంశయ మైనది.

ఇవిగాక స్తూపపునాదుల క్రింద మఱియు సమముగా నున్న మట్టిపొరలలో నత్యంతశోభాయమాన మైన నల్లటి మృణ్మయ పాత్రల యవశేషములు చాల ముఖ్యమైనవి. ఇవి యుత్తరహిందూ దేశము లోని యతిప్రాచీన మైనట్టియు, బుద్ధుని కాలమునకు చెందిన పట్టణాలైన, పాటలీపుత్రము, రాజగృహము, హస్తినాపురము కౌశాంబినగరము, ఉజ్జయిని మొదలగు చోట్ల లభ్యమై క్రీ॥ పూ। 600-700 సంవత్సరములకు చెందియుండెను. వీనిని బట్టియు నశోకుని శిలాశాసనపు భాగమును బట్టియు స్తూపము చుట్టుప్రక్కల నున్న పట్టణశిథిలములు, నొకేకాలమునకు చెందినవని చెప్పనగును. ఇదివరకటి త్రవ్వకాలలో నీ యవశేషము లభ్యము కాలేదు. ఇవిగాక యింకను ముఖ్య మయినట్టివి రోమునగరములో వాడుక లో నున్న మృణ్మయపాత్రల యవశేషములు (Rouletted ware) రోమను చక్రవర్తుల నాణెములు క్రీ శ 100-300 సంవత్సరము లకు చెందిన, (కాలము-2,) మట్టిపరుసలలో దొరికినవి. కాలము -3 నకు సంబంధించిన యనగా 4వ శతాబ్దము నుండి 10వ శతాబ్దము వరకు వాడుక లో నున్న మృణ్మయపాత్రలు, (Celadon ware) తాంత్రికబుద్ధుల శిలాప్రతిమలు, మైత్రేయనాథుడు, హేరుకతార ఉగ్రతార మొదలగు మూర్తులు లభ్యమైనవి. ఈ విధముగ ఈ ప్రదేశము క్రీ॥ పూ 3వ శతాబ్దము నుండి 10వ శతాబ్దము వరకు నత్యంత ప్రాముఖ్యమయి

యుండి విదేశములతో కూడ సత్సంబంధసన్నిహితముగా నుండినట్లు, త్రవ్వకముల వలన కూడ రూఢి యైనది.

శ్రీ రావిప్రోలు సుబ్రహ్మణ్యముగారి పరిశోధనల ఫలితాలతో నుత్తేజితులై, తిరిగి 1962 లో భారతప్రభుత్వము శ్రీ వేంకటరామయ్య గారి యాధ్వర్యవమున ధాన్యకటకము ను త్రవ్వవలె నని నిశ్చయించెను. ఈ త్రవ్వకములు (Indian Archaeology A review, 1962-63 and 63-64.) శాతవాహనుల పట్టణ మని యెంచబడిన యెత్తైన కోటగోడల పైనను, కృష్ణానది గట్టున పడమటి భాగమునను నుద్దేశించి మొదలు పెట్టబడినవి, ఈ త్రవ్వకముల కారణముగా కోటయొక్క పడమటి భాగము నానుకొని దాని వెలుపల, కృష్ణకు చేరువనే యున్న యొక పెద్ద యోడరేవు, దానికి సంబంధించిన కట్టడములు, నావలను నదిలో నుండి రేవులోనికి తీసుకొనివచ్చు కాల్వమార్గములు బయల్పడినవి. ఈ కట్టడము లన్నియు నొక్కసారిగా చేయబడ లేదు. షుమారు 6 దఫాలుగా వివిధసమయములలో నవసరముల కనుగుణముగ పూర్తి కావింపబడెను. మొట్టమొదటి నిర్మాణము క్రీ॥పూ॥ 2 వ శతాబ్దమునకు చెందినది. ఆతర్వాత యాఖరి శాతవాహనుల ఇక్ష్వాకుల కాలములలో పాత దానిని తిరిగి బాగుచేయించుటయే గాక యెత్తును పెంచుటకూడ జరిగెను. కోటగోడలకు వెలుపలి వైపు మట్టికంకరతో గట్టుపోయించుట యేగాక యవసరమగు చోట్ల సిటుకగోడలను కట్టిరి. దీనినిబట్టి చూడగా కృష్ణానది పలుమారు లుధృతముగా పొంగి యా యోడరేవును కోటగోడల ను ముఖ్యముగా పడమటివైపు నాశము కావించి నట్లు తెలియుచున్నది. వ్యాపారావసరములను బట్టియు పట్టణప్రాముఖ్యమును బట్టి పలుమార్లు తిరిగి బాగు చేయించవలసివచ్చెను. ఈ విధముగ నీ రేవుపట్టణము క్రీ॥ శ॥ 500 సంవత్సరములవరకు విశేషముగ నుపయోగములో నున్నట్లు తెలియుచున్నది.

ఇదివరలో మనకు శాసనములద్వారా యాత్రికుల రచనల వలన నమరావతి నాగార్జునకొండల ఖ్యాతి యితరప్రాంతములతో వాని వాణిజ్యవ్యాపారసంబంధములు చూచాయగా మాత్రము తెలియు చుండెను. పై త్రవ్వకముల వలన బయల్పడిన యవశేషము లన్నింటిని బట్టి యీధాన్యకటకము రేవుపట్టణముగా శాసనములలో చెప్పినట్లు అంగవంగవై దేహచీనయవన సింహళదేశముల వర్తకము గావించు చుండె ననుట నిస్సంశయముగా తేలిపోయినది ఇక్కడనుండి యోడలు సరుకులనింపుకొని మచిలీపట్టణము వరకు (మైసోలియా) నదిలో ప్రయాణముచేసి యా తర్వాత బంగాళాఖాతము చేరుకొనెడివి.

1963 వసంవత్సరములో కూడ పై యధికారి కోటగోడల కీవల వైపు నుండిన పట్టణము లోని కట్టడవివరములను వాటికాలమును తెలిసికొనుటకై మఱికొన్ని చోట్ల త్రవ్వకములను కొనసాగించెను. ఇంకనుకొన్నికొన్ని చోట్ల త్రవ్వకములుజరుగుచున్నవి. ఈ త్రవ్వకముల లో రోమనుచక్రవర్తుల నాణెములు (ముఖ్యముగా చక్రవర్తులు అగస్టువసు హేడ్రియానసు ఫాస్టినా మొదలగువారివి) గాజుగ్లాసులు "ఆంఫోరా" యను నట్టి కూజాముక్కలు మొదలైనవి చాల ముఖ్యమైనవి. వీనినిబట్టి తర్వాతశాతవాహనే క్ష్వాకురాజులు రోము సామ్రాజ్యముతో యెంత సన్నిహితసంబంధము లుంచికొనిరో తెలియు చున్నది. రోమునగరము నుండి యోధులను రప్పించుకొని తమ ప్రాసాదములలో కావలి గా నుంచుకొన్నట్లు మనము శిల్పములద్వారా కూడ గ్రహింపనగును.

3. అశోకుని శిలాస్తంభశాసనభాగము : దానిప్రాముఖ్యము

ఈమధ్యబయల్పడిన వానిలో నత్యంత ప్రాముఖ్యమైనది, చిత్రపటము-1 లో చూపబడిన శాసనభాగము. ఇదివరలో అనగా 19వ శతాబ్దపు త్రవ్వకముల లో కూడ కొన్ని క్రీ॥పూ॥ 2వ శతాబ్దపు

బ్రాహ్మీలిపి కల రాతిముక్కలు దొరికియున్నవి. బర్గెస్ దొరగారు (Archaeological survey of India vol I, PL. LVI-No 4) వానిని గూర్చి వ్రాయుచు ముఖ్యముగ "ముడకతల" యనునొక సేనాని గావించిన శిలాశాసనమును గూర్చి చెప్పియున్నారు. ఆతర్వాత కూడ నీ మౌర్యకాలలిపికి సంబంధించిన శాసనపు ముక్కలు పలురకములు దొరకినవి. వానిని శ్రీరామేశ్వరప్రసాద్ చందా గారు (Epigraphia Indica vol XV PP. 258H). ప్రచురించిరి. వీటన్నిటి కన్న, ప్రాచీన మైనది దక్షిణహిందూదేశ చరిత్రలోనే యత్యంత ప్రముఖస్థానమును సంపాదించుకొనబోవునది యీక్రింద విశదీకరింపబడుచున్న యశోకుని శిలాస్తంభ శాసన భాగము. దీనిని శ్రీ దినేశచంద్రసర్కారుగారు "ఎపిగ్రాఫియా ఇండికాసంపుట -35 సంచిక 1 పుటలు 41-43 లలో వివరించి యున్నారు. శాసనము కల శిలావశేషము 10 అంగుళములపొడవు 17 అంగుళముల మెత్తుకలిగియుండి 7-వరుసల యక్షరముల గల్గి యున్నది. వరుసలు 6 7 లలో నక్షరములు పూర్తిగా శిథిలము లైనవి. ఈశాసన మశోకుని యితర శిలాస్తంభశాసనములవలె చూనార్ గనులలో చెక్కించి నునుపు చేయబడలేదు. ఇది మన యాంధ్రలో నల్లమల ప్రాగంభములో లభ్యమగు చదునైన "యిసుకరాతి" తో చేయబడినవి. మౌర్యకాలమునాటి ప్రఖ్యాత మైన శిలాస్తంభము లన్నింటిపైన కల యత్యంతశోభాయమానమైన నునుపుదనము కానరాకపోయినను చక్కగనే నునుపు చేయబడి యున్నది.

ఈశాసనములయెక్కలిపి అశోకునికాలపు బ్రాహ్మీభాష ప్రాకృతము. శాసనములోని యక్షరశైలి యశోకునిచే చెక్కించబడిన పడమట దక్షిణదేశములలోని రాతిశాసనములను బోలియున్నది.

ముఖ్యముగ "గీర్నారు" రాతిశాసనమునకు నతిసన్నిహితముగా నున్నది. ఇంకను పూర్తిగా మిగతభాగములు దొరికినచో నీశిలాస్తంభ శాసనము దక్షిణహిందూదేశములో నశోకుని మొట్టమొదటి శిలాస్తంభముగా భావింపనగును.

ఇక శాసనమును వివరింతము. ఒక్కొక్కవరుసలోని పద ప్రయోగముల నితరాశోక శాసనములలోని మాటలతో పోల్చి చూతము.

వరుస 1 :- పరా(ర్), త అభి (స) - పూర్తిగా "పరాత్త అభిసిత" యని యుండవచ్చును. మొదటిపదములో "త" యనుచోట "ర్త"గా వ్రాయబడినది. ఇదియశోకుని గీర్నారు శాసనములోకూడ కానవగును. కాని యశోకుని శాసనములలో "పరార్త" (పరలోక) మఱియు "అభిక్షిత" (కోరబడిన) ఈ రెండును నొకచోట కానరావు. శ్రీ సర్కారుగారు దీనినే "అభిక్షిక్త" యని తీసుకొనుచు నీరెండు పదములు నీవరుసలోనే కలిపి చదివినచో నర్థమిచ్చుటలే దని "పరత" యనునది యూపై వరుస కన్వయించి రెండవపదమును వేరుచేసెను. కాని పై విధముగ చదివినట్లయినకొంత యర్థవంతముగా నుండునేమో!

వరుస 2 :- ఖోలిఖతె [మ+] ఇ – – పూర్తిగా "ఇదఖోలిఖతె మె యని యుండవచ్చును. 'ఖో' యను నక్షరమునకు ముందున్న యక్షరభాగమును 'ధ' గా భావించినచో దానిముందు 'ఇ' యుండవచ్చునని సర్కారు గారి యభిప్రాయము. అట్లే 'తె' తర్వాత, మరి యొక 'మె' యుండవచ్చు ననుట మరింత సమంజస మనిపించుచున్నది. పూర్తిగా "ఇధ ఖోలిఖతెమె" యనగా ఇహా ఖలులిఖితం మయా, (ఇది నాచే స్వయముగా లిఖింపబడినది). ఈవరుస నశోకుని శాసనములకు మరింతదగ్గరగా యున్నది. 'ఖో' యనుపద మశోకుని శాసనములలోనే వాడబడయున్నది. ఆతర్వాత ప్రాకృత శాసనములలో నెచ్చటను

(సశేషము)

ఆంధ్రీకరణసమస్యాపూరణములు

ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రిక గతసంచికలో నొసంగబడిన శ్లోకము సమస్యయు—

శ్లో. రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్
అయోధ్యా మటవీం విద్ధి గచ్ఛ తాత! యథాసుఖమ్.

సమస్య: శా. గిల్లెన్ సీతను రావణాసురుఁడు దా
గేఁగ్రిగంట నీక్షించుచున్.

కవుల యాంధ్రానువాద సమస్యాపూరణములు —

1. శ్రీ శిష్ట్లా బాలకోటీశ్వరరావు

తే. గీ. దశరథునిబోలె రామచంద్రముని దలఁచి
మాపగిది జనకాత్మజ న్మానసించి
కాననమ్ము నయోధ్యగ గారవించి
పోయి రా నాయనా! సుఖమ్ములు ఘటిల్లు.

శా. చెల్లెన్ రాముని విక్రమారభటి ని
శ్శేషంబుగా నేఁడు మూ
ర్ఛిల్లెన్ లక్ష్మణుఁ డస్మదీయపటుని
స్త్రింశమ్ముచే నొచ్చి భీ
తిల్లెన్ వానరయూథ మోయబల! యే
దీ దిక్కు నీకంచు రా
గిల్లెన్..................నీక్షించుచున్.

(రాగిల్లు=గర్వోక్తులుపలుకు (సూర్యరాయాంధ్ర నిఘంటువు)

2. శ్రీ బి. యస్. మూర్తి

తే. గీ. నీవు రాముని దశరథునిగఁ దలంచి
మాసరిగ మేదినీసుతన్ మానసించి
వని నయోధ్యగ మదిలోన ననుమతించి
యరుగుమా తండ్రి! సౌఖ్యమ్ము లందఁగలవు.

శా. అల్లంతన్ గని సీత కాంచనమయం
బౌ లేడి నర్థింపఁగా
విల్లమ్ముల్ కయిసేసి రాముఁ డరుగన్
వెన్ వెన్క సౌమిత్రి వో
నల్లొల్యమ్మున నాకుటీరనికటం
బుద్వృత్తి మై డాసి రా
గిల్లన్............నీక్షించుచున్.

3. శ్రీ గున్నేపల్లి అక్షయలింగకవి

ఆ. వె. దశరథుబలె రాముఁ దలఁపుము మావలె
జనకరాజతనయఁ గనఁగదయ్య!
అడవియే యయోధ్యయంచు నెంచి యనుంగుఁ
బుత్త్రి! సౌఖ్య మెనయఁ బోయి రమ్ము.

శా. ముల్లోకమ్ములయందు జవ్వనులు, పూఁ
బోండ్లుం, జకోరాక్షులుఁ
ఫుల్లాబ్జాస్యలు లేరె? వారియెడలన్
మోహమ్ము వాటిల్లనే?
యిల్లావణ్యవతీ తనూవిభవ మెం
డేఁ గంటిమే? యంచు రా
గిల్లన్.................నీక్షించుచున్.

4. శ్రీ ఓరుగంటి రామచంద్రయ్య

క. కను రాముని దశరథుగా
కనుమా జనకజను నన్నుగాఁగ, నరణ్యం
బు నయోధ్యాపురిగా బొడ
గని పయనింపుము యథాసుఖమ్ముగ తండ్రీ!

శా. ఒల్లం బొమ్మను రాముపొందునకు ను
        ద్యోగించి ముక్కుం జెవుల్
కోల్లంబోయెను చుప్పనాతి; ఖరము
        ఖ్యుల్ ద్రుంచినా; రేమి సం
ధిల్లన్ లంకకు, జానకీశ్వర కుభిధా
        గ్నిం రాజిలం జేయు, రా
గిల్లెన్....................నీక్షించుచున్.

5. (శ్రీ) ఆర్. అనంతపద్మనాభరావు

తే. గీ. రాము నెదఁదలంపుము దశరథునివోలె,
        జనకనందన నెంచుము జనని వోలె
        నీయయోధ్యగ భావింపు విపినవిని
        పోయిరావయ్య నాతండ్రి! మోదమునను.

శా. "ఉల్లంబందున భీతి గల్గెడిని, అ
        య్యో! లక్ష్మణున్ పంపితిన్
చెల్లింబో! యిక నాదు పాప మనుచున్
        చింతించు భామామణిం;
చెల్లెల్ జెప్పిన రూపసంపదలతోఁ
        జెన్నొందగం గాంచి, రా
గిల్లెన్..........................నీక్షించుచుం.

6. (శ్రీ) వి. మల్లినాథశర్మ

తే. గీ. రాము సీతండ్రి దశరథరాజువోలె
        భూమిజాతను నన్నుగా బోలనెంచి
        యాయరణ్య మయోధ్యగా నాత్మనెంచి
        కదలి పో మిమ్మక నాతండ్రి! కడుసుఖముగ.

*7

ఆ. వె. దశరథునిగ రాముఁ దలఁపుము; మావలె
జనకరాజతనయఁ గను; మయోధ్య
భాతిఁ గాననంబు భావింపుమా సుఖం
బుగను పోయి రార ముద్దుతండ్రి!

*8

తే. గీ. రాము దలపోయుమా దశరథునివలెను;
జనకతనుజను మావలె గను; మయోధ్య
భాతి నెంచుము గహనమున్; పరమసుఖము
దనర జనుమయ్య నాముద్దుతండ్రి! నీవు.

*9

క. తెలియుము రాముని దశరథు
బలె, మావలె జనకధరణివల్లభతనయం
దలపు; మయోధ్యగ వనమును
దలపోయుము పోయిరమ్మ తండ్రీ! సుఖవై.

* అనల్లిఖిత నామధేయు లగుమువ్వురినుండి మాకుచేరిన మనోహర పద్యానువాదత్రయము.

10. శ్రీమతి యస్. హైమవతి

తే. గీ. రాఘవుని దలంపుము దశరథుని పగిది,
కనుము మావంటి దని యెంచి జనకతనయ,
నూహసేయుము వనము నయోధ్య యనుచు
వెడలిర మ్మింక కుశలివై కొడుకుగుజ్జ!

శా. చల్లెన్ మంజుల శీతలాతపసుధల్
జాబిల్లి శోభిల్లి సం
ధిల్లన్ లాలితమల్లికాపరిమళా

స్వీతమ్మ వాతమ్మ, రం
జిల్లెఁ మామది కామితార్థదము లీ
(శ్రీ) లెంచు మీ వంచురా
గిల్లెన్.................నీక్షించుచున్.

11. (శ్రీ) రేగిళ్ళ సత్యనారాయణశర్మ

తే. గీ. రాముని తలంపుమీ దశరథునిగాను
జనకసుతను మావలె నెంచుకొనుము; ఘోర
గహనమును నీ వయోధ్యానగరము నట్లు
నెంచి పుత్రకా! సుఖమున నేగు మయ్య.

శా. ఉల్లాసంబున నగ్నిలోఁ బడుటకై, యుద్యుక్తకీటంబులో
అల్లాడేహృదయాన పంచవటి నేకాంతప్రదేశంబులో
ముల్లోకాలకు దల్లిజూచి మదిలో మోహంబు రేకెత్త రా
గిల్లెఁ సీతను.....................నీక్షించుచున్.

వేమన విషయ మేమి

(శ్రీ చేకుమళ్ళ కామేశ్వరరావు)

వేమనమహాకవి పేరును వినని తెలుగువ్యక్తి యుండడు. అతని పద్యములకు నంతటి జనత (పాప్యులారిటి) యున్నది. అయితే యమ్మహాకవి యెన్నిపద్యములను వ్రాసినాడు? ఎక్కడివాఁడు? ఎప్పటి వాడు? ఇత్యాదిసమస్య లున్నవి.

గ్రంథ బాహుళ్యము

ఈ కాలములో నచ్చయిన వేమనగ్రంథములలో నయిదు వేల పద్యములు గలవి కనబడుచున్నవి. 1924 లో రాయవరపు పూర్ణయాచార్య లచ్చువేసిన వేమనసూక్తిగర్భావళి యనుగ్రంథములో

4035 పద్యము లున్నవి. అంతకు పూర్వము 1824 లో సి. పి. బ్రౌను ద్వార తెలుగు దేశపు నాలుగుమూలలనుండియు వ్రాతప్రతులను బ్రోగు చేసి, రమారమి 2000 పద్యములను సేకరించెను.[1] వానిలో 693 టి నెంచి, యాంగ్లానువాదముతోఁ గూడ 1829 లోఁ బ్రకటించెను. మిగిలి నవి వేమనవి కా వని సందేహించెనా? తంజావూరి సరస్వతీమహాలులో నున్న తాటాకుప్రతులలో 500 కి మించిన పద్యము లున్నప్రతి లేదు. ఇట్లు వెనుకకు పోనుపోను వేమనపద్యసంఖ్య తగ్గుచున్నది. అనగా, మొదట కొంచెముగా నున్న వేమనపద్యములు కాలముగడవను జాస్తి యైన వని స్థూలముగా నిర్ణయించవచ్చును. అట్లు వృద్ధియగుటకు కారణము లేమి? వేమన వ్రాసిన యాటవెలదిపద్యముల ననుక రించుట బహుసులభము. వాని లక్షణము, భాష కూడ అంత తేలిక. కాబట్టి యా మాదిరి పద్యము లితరులచే సృష్టింపబడినవి.

వేమన నీతికవిగా నె కాకుండ వేదాంతకవిగాకూడ పేరుపొందెను. అతని పేరిట నొకమతసంప్రదాయ మేర్పడినది. దాని ననుసరించినవారు కొందఱు వేమయ్యల మని పేరు పెట్టుకొన్నారు. గంజాయిదమ్ము బైరాగులు కావలసినంతమంది! వీ రందఱును వేమనకవిత్వమునకుఁ దమపైత్యమును బుష్కలముగా చేర్చిరి.

వేమన యాటవెలదిలోఁ జెప్పినభావమును వేమయ్యలు, బైరాగులు మరియొకలక్షణములోనికి మార్చి చెప్పెడివారుకూడ- అనగా, కందము, తేటగీతి, వృత్తము మొదలైనవానిలోనికిగూడ పరివర్తన చేసెడివారు. ఇట్లు కాలము పోను పోను నెన్నియో రూపాంతరములు బయలుదేరినవి. అంతేకాక పామరులనోళ్ళలో బడి పద్యములకుఁ బాఠాంతరములు ముమ్మర మైనవి. ఆ రీతిగా వేమనపద్యములసంఖ్య వేలమీఁదికి బెరిగిపోయినది.

---

1. సి. పి. బ్రౌన్ - కొత్తపల్లి వీరభద్రరావుగారి గ్రంథం (1963) పుటలు 102,103.

శతకము వంటి రచనలు

ఈ పట్టున శతకమువలె కనఁబడు నితరరచనలను గుఱించి కొంత ప్రస్తావించవలసియున్నది. సంస్కృతసంప్రదాయము నటుంచి తెలుగు పద్ధతిని చూచెదము.

శతకమువలె కనఁబడు నితరరచన లున్నవి. వానిలోని పద్యములనుఁగూడ నేదియో యొక మకుట ముండును. అయితే మకుటము గ్రంథమంతట నొకేవిధముగా నుండవలె నను నియమము లేదు. ఈ రచనలలో నంతరశీర్షిక లుండును. గ్రంథములోని పద్యములసంఖ్య కొకపరిమితి యుండదు. ఇంకను మరికొన్నిలక్షణము లుండవచ్చును. వీని క్రిందివి యుదాహరణలు.

పండితమల్లికార్జునుఁడు వ్రాసిన శివతత్త్వసారము శతకమా, కాదా యనుచర్చ యిదివఱ కుండినది. పాల్కురికి సోమనాథుఁ డా గ్రంథమునుగుఱించి 'శతకంబు, శివతత్త్వసార' మని చెప్పగా, చాల కాలముపాటు విమర్శకులు శతక మను మాట శివతత్త్వసారమునకు విశేషణముగా పరిగణించి, యా గ్రంథమును శతకమనిరి. కాని పండిత మల్లికార్జునుఁడు కన్నడములో నొకటి, తెలుగులో నొకటి 'శ్రీగిరి మల్లికార్జునా!' యను మకుటముతో శతకములను నిర్మించినా డను విషయము వెలుగులోనికి రాగా, వెనుకటివాదన యేమ్యమైపోయినది. అట్లు శివతత్త్వసారము శతకము కాదని రుజువయినది. ఇట్టిరచనలె మఱికొన్ని కలవు. పాల్కురికి సోమనాథుని వ్రాసిన చతుర్వేదసారము చూచుటకు శతకమువలె కన్పడును. దానిలో 301 పద్యము లున్నవి. అంతరశీర్షిక లున్నవి. ఇట్టిది వేరొకపు పుస్తకము. అదే విధముగా యథావాక్కుల అన్నమయ్య వ్రాసిన సర్వేశ్వర స్తోత్రము కూడ దీనిలో అంతరశీర్షిక లుండగా శతకముల జాబితాలోనుండి బైట పడినది.[2] ఇట్టివి కొన్ని శతకములవలె కన్పడుగ్రంథములు. వీటి లక్ష

---

2. నిడదవోలు వెంకటరావుగారి తెనుఁగుకవుల చరిత్ర, పుట 376

ణములను పైన జెప్పితిని. శతక మనుమాటకు విపరీతార్థము గల్పించి, వేలకొలదిపద్యము లున్నగ్రంథమునుగూడ శతక మనుట యర్థములేని మాట.

వేమన శతకము

వేమన యెన్నిపద్యములను వ్రాసె ననునది యొకపెద్దప్రశ్నకదా!

విమర్శకులు వేమనను శతకకవిగానె నిర్ణయించినారు. వంగూరి సుబ్బారావుగారు, వేదము వెంకటకృష్ణశర్మగారు వేమనను శతక కవిగానె నిర్ణయించి, తమ కవులచరిత్రలలోని కెక్కించిరి. అంతకంటె ముఖ్యమైనవిషయ మేమనగా, ప్రాతతాళపత్రగ్రంథములఁ గొన్నిటి మీఁద వేమనశతక మని మాత్రమె వ్రాసియున్నది, శతకమును వ్రాసిన వాఁడె శతకకవి. శతక మను పేరులోనె కలదు దాని పద్యసంఖ్య. మన పూర్వులెందఱో శతకములను సృష్టించిరి. వారిపుస్తకములలో ప్రతి దానిలోను పద్యసంఖ్య నూటి కటునిటుగానుండును. కాబట్టి శతక కవియైనవేమన వ్రాసిన పద్యములుకూడ నూటికి నటునిటుగా నుండు నను విషయమును గ్రహింపవచ్చును. వేరొక లెక్క కుదురదు. అందుచేత వేమన నూఱుపద్యాలు గల శతకమునుమాత్రమె వ్రాసినాడని నిర్ణయించవచ్చును. అదియే వేమనశతకము. కాబట్టి యతనిపేర చెప్పబడెడి వేలాదిపద్యములకును, నతనికిని సంబంధములేదు.

అయితే యతనిపేర చెలామణి యగుచున్న వేలకొలది పద్యములలో నతనిపద్యము లని గుర్తించుటకు సాధనములున్నవా యను ప్రశ్నను పరిశీలించుదము. వేమన పద్యాలను గుర్తించుటకు మొదటి సూత్ర మేమనగా, మనపరిశోధనను ప్రాతతాళపత్రసంపుటములకు పరిమితి చేసుకొనవలెను. దానితో నిటీవల సృష్టింపఁబడిన వేలాదిపద్యముల బాధ తొలగును. ఒకేపద్యము గీతము, కందము, వృత్తము

నిశ్వాదిపద్యములలోనికి రూపాంతరములు చెందగా, మూలపద్య మిది యని గ్రహించి, దాని సత్యస్థితి పరిశీలింపవచ్చును.

ప్రతిశతకమునకు నొకమకుట ముండు నను విషయము మన మెఱిగినదె! ఆ మకుటము నాగ్రంథములో మారదు. వేమన తన శతకమునకుఁ బెట్టుకొన్నమకుటము 'విశ్వదాభిరామ వినుర వేమ' యనునది. కాబట్టి యీ మకుటము గలపద్యములలోమాత్రమె వేమ నవి యున్నవని మనము నిష్కర్షగాఁ జెప్పుకొనవచ్చును. ఆ మకుటము లేని పద్యము లతనివి కావు. ఆ మకుట మాట వెలది పద్యచరణము కదా! అత డాట వెలదిపద్యములనుమాత్రమె రచించినాడు. కాని వేమయ్యలు, గంజాయిబైరాగులు నతని పేరున నితరలక్షణములలోఁ పద్యాలను కూటసృష్టి చేసిరి.

విశ్వదాభిరామ వినుర వేమ యనుమకుటము గలపద్యములైనను నొకనూఱుగాక, కొన్నివే లున్నవి. కాబట్టి యీపద్యములలో వేమన వ్రాసినవి యని కనిపెట్టుటకు సూక్ష్మసాధన లేమైన నున్నవా? వేమన పద్యము లని యందఱి నోళ్ళలో నున్నపద్యములను నాలుగింటిని తీసు కొని, వాని సామాన్యలక్షణములను గమనింపవచ్చును.

ఆ. వె. [3]తామసించి చేయదగ దెట్టికార్యంబు
వేగిరింప నదియు విషమ మగును
పచ్చికాయ దెచ్చి పడవేయ ఫలమౌనె! ॥విశ్వ॥

ఆ. వె. గొడ్డుటావు బితుకకుండ గొంపోయిన
పాల సీక దన్ను పండ్లు వడగ
లోభివాని నడుగ లాభంబు లేదురా! ॥ విశ్వ ॥

---

3. తామసించి యనుమాటకు కోపించి యను నర్థమును చెప్పుకొనుచున్నారు. కాని యది సరియైనదిగాఁ దోచదు. చిత్తూరుజిల్లాప్రాంతములో తామసించి యను మాట వాడుకలో నున్నది. దానికి నాలస్యము, జాగు దనిమాత్రమె యర్థాలు. ఆ యర్థమె యిక్కడ సరిపోవును.

ఆ.వె. అనువుగానిచోట నధికుల మనరాదు
కొంచె మగుచు నుంట కొదువగాదు
కొండ యద్దమందు కొంచమై యుండదా? ॥ విశ్వ ॥

ఆ.వె. గంగిగోవుపాలు గంటెడైనను చాలు
కడివెడైననేమి ఖరముపాలు
భక్తితోడ గూడు పట్టెడైనను చాలు ॥ విశ్వ ॥

ప్రతిపద్యములోను ప్రత్యేకచరణము లేక చరణాలలో నొక యుపమాన ముండును. ఇట్లు వేమన వ్రాసిన పద్యాలకు మరింత సన్నిహిత మయ్యెడము. అయితే వేమన వ్రాసిన ప్రతిపద్యములో నొక యుపమాన ముండు నని చెప్పలేము. అవి లేని పద్యములుకూడ నున్నవి. వానినికూడ వేమన పద్యములుగానె చెప్పుచున్నారు. మచ్చునకు

ఆ.వె. చెప్పులోనిరాయి, చెవిలోనిజోరీగ
కంటిలోని నలుసు, కాలిముల్లు
నింటిలోనిపోరు నింతింతకాదయా! ॥ విశ్వ ॥

ఆ.వె. చంపదగినయట్టి శత్రువు తనచేతఁ
జిక్కెనేని కీడు సేయరాదు
పొసగ మేలుచేసి పొమ్మనుటే చాలు ॥ విశ్వ ॥

ఆ.వె. తప్పు లెన్నువారు తండోపతండంబు
లుర్వి జనులయందు నుండు తప్పు
తప్పు లెన్నువారు తమతప్పు లెఱుగరు. ॥ విశ్వ ॥

ఆ.వె. పరగ రాతిగుండు పగలగొట్టగవచ్చు
కొండ లన్ని పిండి గొట్టవచ్చు
కఠినచిత్తుమనసు కరిగింపరాదయా! ॥ విశ్వ ॥

సుమతీశతకకర్తకూడ తన పద్యాలలో నెన్నియో యుపమలను చేర్చినాడు. కాని ఉపమ లేని పద్యాలనుగూడ వ్రాసినాడు. అట్లే వేమన పద్యములలోఁగూడ నుపమానములులేనివి కలవు.

వేమన పద్యము లని గుర్తుపట్టుటకు మరికొన్ని యితరలక్షణములుకూడ గలవు. అతని పద్యములలోని భావము తేటగాను, భాష తేలికగాను నుండును. నడక కుంటువడదు. భావము చరణము లేక చరణములయొక్క సరిహద్దును దాటదు. అట్లె మాటలుకూడ చరణాంతములో నంత మగును. అంతియెకాని రెండవచరణములోనికి ప్రాకవు. పదమధ్యమందు మరియొక చరణము మొదలుపెట్టదు. అనగా ప్రాకుడుచరణము (రన్ ఆన్ లైన్స్) లుండవు. వీని కెన్ని యుదాహరణములనైన నీయవచ్చును. చరణాంతములందు పెట్టిన గీట్లను గమనించుడు!—

ఆ. వె. ఆలు మగనిమాట కడ్డంబువచ్చిన
ఆలుకాదు, నుదుటివ్రాలుకాని
యట్టియాలు విడిచి యడవి నుండుట మేలు

ఆ. వె. నీళ్ళలోన మొసలి నిగిడి యేనుగ బట్టు
బైట కుక్కచేత భంగపడును
స్థానబలిమికాని తనబల్మి కాదయా

ఆ. వె. ఆడువారి గన్న నర్థంబు బోడగన్న
సార మైనరుచుల చవులు గన్న
అయ్యగారికైన నాశలుగలుగవా!

ఈ విధముగాఁ జెప్పబోయినచో నాతనిపద్యము లన్నియు నుదాహరణలే! దాని కెక్కడైనను మినహాయింపుకూడ కనబడవచ్చును.

అంతియె కాదు. వేమన యొక్కొక్కగణములో నొక్కొక్క మాట సరిపోవునట్లుకూడ చాలవఱకు కూర్చును. అన్నియు రెండేసి,

మూడేసి యక్షరములమాటలు తెలుగువికానింతు, సంస్కృతానివి కానిందు దీనికికూడ నతని ప్రతిపద్యము నొక యుదాహరణమె-

ఆ.వె. కులము గలుగు వారు గోత్రంబు గలవారు
విద్యచేత విఱ్ఱవీగు వారు
పసిడి గల్గువాని బానిస కొడుకులు

ఆ.వె. కులము లో నొకండు గుణవంతు డుండిన
కులము వెలయు వాని గుణము చేత
వెలయు వనములోన మలయజం బున్నట్లు

అయితే మనకు విసుగుపుట్టించునంతగా నీ యేకరీతి (యూనిఫార్మిటి) యుండదు. కాబట్టి యక్కడక్కడ చిన్నచిన్నమార్పు లుండును. పైన నుదహరించిన వన్నియు వేమన రచితములే యని నిష్కర్షగా చెప్పలేము. వేమనపద్యలక్షణములను బాగుగా నెరిగిన వేమయ్యలు గంజాయిబైరాగులుకూడ ననుకరించవచ్చును. అది గుడ్డిగుఱ్ఱపుతావు మాత్రమే. ఉప్పు కప్పురంబు నొక్కపోలిక నుండునుకదా! ఇట్టి పరిశీలనవలన వేమనపద్యములను నూటికి దించవచ్చును.

వేమన పేరుతో నెన్ని యోపద్యము లున్నవికదా! వాని మకుటములు వేరువేరుగా నుండును. వేమన, వేమా, దేవరవేమా, వేముడు, వేమనృపాలశేఖరా మొదలైనవి. అట్టివి యతనివి కావనియు నతని మతసాంప్రదాయికుల కూటసృష్టి యనియు స్పష్టము!

వేమనతాలూకు చాటుపద్యము లని వ్యవహరింపబడుచున్నవి కూడ నట్టివే. అవి శిష్యగణము ప్రసాదించినవి మాత్రమే!

సుమతీశతకకర్తవలె, వేమనకూడ నొక్కశతకమె వ్రాసినాడు. దానిఘనతవలన నాంధ్రవిశ్వవ్యాప్తి యైనది. మసిపాత్రలోని మాణిక్యములనువలె వేమనపద్యములను వెదకి వెలికి దీయవలసియున్నది. అవి నాణిమణులు! (సశేషము)

శ్రీ:

చీనా దురాక్రమణము

[యక్షగానము]

శ్రీ దాసెర రాజగోపాలరావు

క॥ శ్రీమన్నారాయణు హృ
త్సీమం గొలిచి, గణపతిని సేవించి, వచో
భామ న్నుతించి, సుకవులఁ
బ్రేమం దలఁచి, గురువుల స్మరించి ప్రవర్తిన్.

వ॥ అని కవీశ్వరుండు కృతీశ్వరుం డగుచిత్రాడపురవాసుని శ్రీ వేంకటేశ్వరస్వామిని నేమని కీర్తించుచున్నాఁడు.

ద్విపద-
నాత్నాస్మదనకోటిసౌందర్యమూర్తి! అక్షయాశాంతశాంతామలకీర్తి!
జలధర కోమలశ్యామలగాత్ర! జలజారిజలజాప్త సంభృతనేత్ర!
అలఘుదయామృత కలితాంతరంగ! అలమేలుమంగా మనోబ్జసారంగ!
దుష్టశిక్షాదీక్ష! దురితవినాశ! శిష్టరక్షాదక్ష! శ్రీవేంకటేశ! ॥

వ॥ అని సన్నుతించి యా దేవదేవునకు షష్ఠ్యంతములు సెప్పినచొప్పెటువలెను.

అర్ధచంద్రికలు-
మినుకులఁ బ్రోచినమీనంబునకుం, గొండను మోచినకూర్మంబునకుం,
కుంభినిఁ దాల్చినక్రోడంబునకుం, కనక కశిపుఁ జీల్చిననరహరికిన్,
బలిని నడంచినవటుబాలునకున్, నృపతులఁ ద్రుంచినభృగురామునకు,
రావణుదుమిన రఘురామునకున్, గీతాసుధ చిలికినకృష్ణునకుం,
ప్రేమ కరుణ కఱపినబుద్ధునకుం, కలుషుల నఱకిన కల్కినుతునకుం,
ప్రియుఁ డాసర్వుఁడు వేంకటపతికిన్॥

వ॥ సద్భక్తిసమర్పితంబుగా నా యొనర్పం బూనిన చీనాదురాక్రమణ మను యక్షగానంబునకుఁ గథావిధానం బెట్టి దనిన.

ద్విపద—

శ్రీదేవదేవభాషితధర్మసీమ, వేదమంత్రపవిత్రనాదాభిరామ,
మునివరప్రాపితవుణ్యైకధాత్రి, ఘనతరచరిత, సకలదేశనేత్రి,
నీతినియమసంజనితయశోలాస్య, పూతగంగాద్యంబు పోషితసస్య,
నిరుపమసంస్కృతి నిరతవేశంబు, వరణీయరమణీయ భరతదేశంబు॥

వ॥ అటువంటి భరతదేశమునకుఁ బ్రధాని యగుజవహరలాలొక్క-నాఁడు పేరోలగం బున్నవేళ వేగువారలు విచ్చేసి విన్నవించిరఁట యెటువలెను.

త్రిపుటతాళము—

పెద్దయెత్తున వచ్చి మనసరిహద్దుఁ గాచెడివారిఁ జీనా
యెద్దుమొద్దులు మట్టుపెట్టిరి, తద్దసామి! ॥

వ॥ అన విని ప్రధాని చీనానియంత యగుచౌయెన్లైకుఁ దక్షణంబ యాక్షేపంబు పంపి రఁట యెటువలెను.

రచ్చతాళము—

నీతిమాలినచేత లివి, యారీతి నేటికిఁ జేసినారో?
ప్రీతితో మిముఁ జూతుము గదా! ఈతగవు నేఁ డేల మాతో?

వ॥ అంత దానికిఁ జీనానియంత సమాధాన మిచ్చెనఁట యెటువలెను.

ద్విపద—

మా సీమఁ జొరఁబాటి మా వారి నొయ్య,
మీ సైనికులె చంపఁ జూచినా రయ్య!
అసమయమ్మున నాత్మరక్షణము
సేసికొన్నా రంతె మాసైనికు లట. ॥

వ॥ ఈ ప్రకారంబు మృషాభాషణంబుల, నిందారోపణంబుల, నుత్తరప్రత్యుత్తరంబులు కొన్నినాళ్ళు వెళ్ళించి, బిట్టుబిల్లొక్క-నాఁటి

నైనీయు లనంత సేనావాహినులతోఁ బవిత్రహిమాలయమ్ముల నతిక్రమించి, భారతభూభాగంబును దురాక్రమణం బొనరించి భారత ప్రభుత్వంబునకు నేమని వార్తనంపిరి.

గీ॥ ఆంగ్లసామ్రాజ్యవాదు లయ్యదనునఁ దమ
యిచ్ఛవచ్చినక్రియ నిర్ణయించినారు,
రిత్తమేర 'మెక్మాహన' రేఖ యనుచు;
దాని నీకొన మెంతమాత్రంబు మేము.

వ॥ దానికి భారతప్రధాని సమాధాన మొసంగిరఁట యెటువలెను.

గీ॥ అది చరిత్రప్రసిద్ధ మైనట్టి హద్దు;
గౌరవించిరి దాని మీా వారుకూడ,
నెంతకాలమునుండియో యెలమితోడ;
నేఁడు కా దను టయ్యెది పాడి యగునె?

వ॥ అందులకుఁ జీనానియంత యే మను చున్నాఁడు.

లఘు శేఖరము–

క్రొత్తహద్దు దిద్దుకొనుట యుత్తమంబు మీారు మేము;
ఇత్తగవున కొప్పుకొన్నఁ, బొత్తు కుదురు మీాకు మాకు;
ఒప్పుకున్న నేఁడు పోరు తప్ప దింక; మంచి చెడుగుఁ
జెప్పి చూచినాము మేము; తప్పు లేదు మా యెడ మఱి॥

వ॥ అనవుడుఁ జీనాకు నెదురాడు తెగువ లేనిపిఱికిపందలును, నిదియదనుగాఁ గైకొని తమస్వార్థంబులు సాధింపఁ జూచుచున్న మొక్కలికాంగ్రడు, దక్కఁ దక్కుంగలశిష్టరాజ్యాధినేత లెల్లరును నే మను చున్నారు,

సీ॥ అసమానవిజ్ఞానలసమాన భారత
శ్రీ పెంపుసొంపు వీక్షింపలేక,
యల్ల జంబూద్వీపమం దెల్ల తమమాట
క్రిందయ్యెడు నటన్న కించచేత,

పనుదినము తమసీమ నెదుగుజనసంఖ్య
గడ్డుసమస్యయై గాసిఁ బెట్టు,
నెవ్వరితోడనో యెప్పుడు కలహించు
చుండెడి కడునడి బండ వోట,

గీ॥ శాంతి కాముకులును, నహింసాప్రియులును,
బరమధార్మికులు, నవీనవర్గరతులు,
నైన యలభారతీయులపైనఁ గత్తి
దూసినారు చైనీయులు దుష్టమతులు.

వ॥ అప్పటున భారతప్రధాని ప్రజానీకంబును హెచ్చరించిరఁట యెటువలెను.

ఆదితాళము—

అవె! చీనాసేనలు, లెండు! లెండు! యువకులారా! యువతులార!
అవక్రపరాక్రమ ధైర్యస్థైర్యవివేకవిభూషితులార! ।
అంచిత శాంతికాముకులమై భావించినాము మిత్రులుగాఁ
బంచశీల నమ్మసేసి వచ్చిరి వంచకులై శత్రులుగా॥
మతమట బౌద్ధము; అహింసయఁట ధర్మ మహో! ఎంతవిచిత్రము!
అతులితహింసాపరిపూరితములు, సతతము సేఁతలు మాత్రము॥
సమయమువచ్చెను నేఁడిఁకఁ దడయక సలుపుఁడు సర్వముత్యాగము
సుమాళమున మన జన్మభూమిపైఁ జూపుఁడు మీ యనురాగము॥
మన మెల్ల భారతీయుల మనియెడిమాటను మఱిమఱి తలఁపుఁడు,
అనన్య మగణ్య మహా మన భారతజననీప్రతిష్ఠ నిలుపుఁడు॥
వినోదవిలాసవిభేద విరోధవిధంబులు విడిచిపెట్టుఁడు;
అనంతదీక్ష మాతృదేశరక్షణార్థ మయి నడుముకట్టుఁడు॥
ధర్మము మన పక్షము, భగవానుఁడు తద్రక్షకుఁ, డేల భయము?
నిర్మలకర్మాచరణులము మనము; నిజముగ మనదే విజయము॥

వ॥ అత్తఱి నాకాశవాణి వార్త లాకర్ణించుచున్న త్యాగమూర్తి యైనస్వర్ణ యనునన్నులమిన్న యార్తి నెచ్చెలికత్తెతో నే మను చున్నది.

త్రిపుట తాళము–

వింటివే? చెలి! దాడిచేసినదంట చీనా, మనదు నోముల
పంట పావనభారతావని పైన నేఁడు॥
నాశనము కాకుండ నియ్యెడ దేశమును రక్షించుకొనుటకు,
రాశులుగ మఱి ధనము కావలె రణములోన॥
కూడఁబెట్టినసొమ్ము లెల్లరు పాడినిచ్చెడియదను వచ్చెను,
దోఁడఁబట్టుక పోరుగాదే! తుదకు నేరు?॥
వెంటనే చని దేశరక్షణపొంటె నా నగ లిచ్చిరమ్మా!
ఒంటిమంగళసూత్ర మొడలిని నుంటచాలు॥
దేశసేవకు నుపకరింపని యీశరీరవిలాస మేటికి?
లేశమైనను నీనగలపై నాశ యేటికే?॥

వ॥ ఈలీల నాబాలగోపాలంబు, స్త్రీలు పురుషులు లక్షాధికారి మొదలుకొని, భిక్షుకునివఱకు, భారతీయుఁ డన్నవాఁడెల్ల, శక్తికిమించి ధనకనకవస్తువాహనాంబరనికురంబంబులు సంబరమున సహస్రలక్షలు రక్షణనిధికి సమర్పించుచున్నంత, సుజాత యనువీరమాత యొకర్తు తనపుత్త్రుఁడు విజయుని బ్రోత్సహించెనఁట యెటువలెను.

మ॥ కొడుకా! దైవము పెక్కునోములకు నాకున్ నిం బ్రసాదించె; నేఁ
డుడిగెం గాలము; లావు సెల్లె; స్మరణీయుండయ్యె మీయయ్య; నా
యెడఁదం గోరిక యొండు తా మిగిలిపోయెన్ నాఁటికిన్ నేఁటికిం;
బుడమిన్ నే నొకవీరమాత నను మెప్పుంబొందుటే యద్దిసూ!

శా॥ పాచాతంబులతోడ వచ్చి మన భూభాగంబునన్ నేఁడు, చీ
నాదుష్టాత్ములు పక్కవేసికొని యున్నా రంట, విన్నావుగా?

యౌదాసీన్యము నుజ్జగించి పటుశౌర్యస్ఫూర్తిమెఁ బుత్ర! యా
ప్రాదయ్యంబులఁ బాఱఁదోలవలె సంరక్షింప స్వాతంత్ర్యమున్

వ॥ అన విని విజయుండు తల్లితో నేలాగున నుల్లేఖించుచున్నాఁడు.

శా॥ అమ్మా! దీవన లిమ్ము, “కొమ్ము విజయం బంచుం, జిరంజీవివై
రమ్మా”, యంచును నాకు; సైన్యమునఁ జేరం బోవుచున్నా నిదే!
నెమ్మిన్ నే శిరసావహించి వరమౌ నీ యిచ్చునాదేశముం,
సమ్మోదంబున మాతృదేశమునకై సర్వస్వ మర్పించెదన్.

ఉ॥ ఈయవె! నీదుచిత్తరువు, నే గొనిపోయెద యుద్ధభూమికిం;
బాయక నీ సుధామధురవాక్కులు జ్ఞప్తికిఁ దెచ్చుకొంచు, న
మ్మా! యలచిత్రమందలి త్వదాస్యమునం బ్రతివాసరంబు, చై
నీయుల పచ్చివెచ్చనగు నెత్తురుతోఁ దిలకమ్ము దిద్దెదన్.

వ॥ ఈ చందంబున నశేషయువకబృందంబు, మదాంధగంధసింధుర సంఘంబుమీద లంఘించు సింగంపుంగొదమలభంగి, పొంగారునుత్సాహంబునఁ, జీనాసేనావారంబులపై దుముకుచున్నంత సంగరరంగంబున నుండి చారులు తోతెంచి ప్రధానికిఁ జైనీయుల దుండగంబులు నివేదించిరఁట యెటువలెను.

ద్విపద—

సామి! వారలసేఁత లేమి సెప్పుదుము!
వీమాటునసో దాఁచి తా మాయుధములు,
లామాలవలె వచ్చి సాపము నెఱపి, యేమఱి యున్నంత నే చంపువారు;
గొడ్డుగోదలఁ దోలుచుకొని పోయినారు; బిడ్డలఁ దల్లులఁ బెడబాపినారు;
ఒకగుడినుండి కొంకక బుద్ధమూర్తి సకలమ్ములోడ నెత్తుకుపోయినారు;
పరికింప నీచీనివారలకంటెఁ గర మలనాఁటిరక్కసులైన మేలె!

వ॥ అన విని ప్రధాని యే మనిరి.

మత్యతాళము—

గోవుమొగము పులు లటంచు, నేవలేక యుంటి మకట!

సావి నెంచి నేఁడు కీడు నావటించినారు వీరు ॥
కేవలమ్ము దురమునఁ దమ లావుఁ జేవను దలఁచుకొని,
కావరమున నున్నవారు, భావిదృష్టి లేక వీరు ॥
వేగిరమున నన్నిటను బురోగమించుచున్న మనదు
బాగు చూచి కడుపుమంట నీగోడవకుఁ గడఁగినారు ॥
ఏరితోడ లేదు మనకు వైర మనుచు, నాద మఱచి
నార వరాట నోటమి మునుపోరులోనఁ బొందినాము ॥
ఐన దేమొ రైన దింకఁ, బ్రాణమైన సరకుఁగొనక,
పూనిక మన సీమనుండి చీనివాని గెంటవలెను ॥
వ॥ అయ్యెడఁ బ్రపంచమందలి యనేకరాజ్యాధినేత లేమి సేసిరి.

అటతాళము—

భరత దేశము చీనీదాడికి శిరము వంచినయెడలఁ,
బరిణమించుఁ బ్రపంచశాంతికి కరము చేటు ॥
అనుచు భారత దేశమునకై యునికి సాయ మంపిరి,
ధనము ధాన్యము లాయుధంబులు ఘనముగాను ॥

వ॥ ప్రపంచసానుభూతి యీ రీతి భారతీయుల వైపు సేపుగ మొగ్గుచున్నకన్నెఱింగి, యోటమియందలి బెగ్గల మగ్గలింపఁ బోరాటంబు డిగ్గనాడి కొంతమేర వెనుకకుఁ దగ్గి, చైనీయులు సంధిసూచనలు సేసిరఁట యెటువలెను.

గీ॥ పోరుడిగి వెనుకను నింతమేర మేము
తగ్గినా, మంతమేరకుఁ దగ్గిరేని
మీరు నున్నచోటుననుండి పోరుమాని,
సమ్మతింతుము రాయబారమ్ము సేయ॥

వ॥ అనుటయుఁ బ్రధాని చీనానియంతకు సమాధానమిచ్చిరఁట యెటువలెను.

కుఱుచజంపె తాళము—

మాయిలను నలి పీడిపోమ్మ, లేదా రాయబారమె లేదు సుమ్మ॥
నమ్మ మోసము సేసినావు, నీ వేసమ్మ లింకిటఁ బనికిరావు॥
నీలావు పాడసూచి మేము, సుంతయు, డీలుపడువారలము కాము॥
యుద్ధమున కేము సిద్ధమ్మ, లెమ్మా! బుద్ధి దారికిఁ దెచ్చుకొమ్మ॥

వ॥ అయ్యవసరంబున.

క॥ జంబూద్వీపాంతర రాజ్యంబులు గొన్ని సభసేసె నలసింహళదే
శంబునకు రాజధాని కొలంబోనగరమున నిక్కలను వారింపన్॥

వ॥ ఆ సభవారు సేసినప్రతిపాదనములఁ గైకొని యొక్క శుభముహూర్తమున—

త్రిపుటతాళము—

రాయబారము సేయఁ జీనా పోయె సింహళముఖ్యమంత్రిణి;
మాయమాటల సాగనంపిరి యాయబలను॥
ఔను కాదనకుండ నేవో లేనిపోనిసవరణలు నుడువ
బూని రాప్రతిపాదనములకుఁ జీనివారు॥

వ॥ పిమ్మట యమ్మంత్రిణి భారతదేశంబునకు విజయంబొనరించి, కొలంబో ప్రతిపాదనములు ప్రధానికి నివేదించెనఁట.

ద్విపద—

అంతట వారు సహచరులతోడ మంతనంబులు సేసి సాంతంబుగాను,
పన్నుగాఁ దరిచి యాప్రతిపాదనముల,
నున్న వున్నట్టుగా నొప్పుకొన్నారు;
ఈ కరణిఁ బ్రధాని యీకొన్నఁ, జీని యేకాకి యైపోయె లోకంబులోన॥

వ॥ ప్రపంచమందలి రాజకీయవేత్తలత్తఱిఁ జీనానియంత యవివేకమును గర్హించుచు, భారతప్రధాని చూపిన యసమాన రాజనీతిజ్ఞతకు నివ్వెఱపోయిరి. అటు లుండ భారతదేశమును నాదుకొన్న వివిధ దేశాధీశులను బ్రధాని యభినందించిరఁట యెటువలెను. (సశేషము)

గ్రంథస్వీకృతి

శ్రీ బండారు తమ్మయ్య

1. వరూధిని :- పద్యకావ్యము. వెల రు. 0-50 లు. కర్త సహస్రావధాని శ్రీ రాంవీరబ్రహ్మ కవిగారు, బందరు.

ఈ లఘుకృతి మనుచరిత్రమునందలి వరూధిని కథకు సంబంధించినది. ఇందు 109 పద్యములు కలవు. వానిలో నచట కవిగారి వార్ధక్యము కతముననో, ముద్రాపకుల యసమ్యక్పరిశీలనము వలననో దోషములు కానవచ్చుచున్నవి. అయినను శైలి మృదుమధురము.

2, 3. భారతప్రధానులు శ్రీ జవహరిలాల్ 'లాల్ బహదూరు శాస్త్రిల స్మృతులు:- వెల 0-50. ప్రచురణకర్త శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరావుగారు, భారతీ సమితి, పామర్రు.

4. కవిసార్వభౌమ శ్రీ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి స్మృతి వెల 0-50 శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరాయ ప్రచురితము.

5. గోల్కొండ:- పద్యకావ్యము ద్వితీయముద్రణము వెల రు.2/-లు. రచయిత శ్రీ సురగాలి తిమోతీ జ్ఞానానందముగారు, కాకినాడ.

కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథసత్యనారాయణగారిని వీరు గురువులుగా భావించి పూజింతురు. వారు వీరిని వాత్సల్యముతో ప్రేమింతురు. ఈ కవి రచనలు సాధారణముగా గురువుగారి యామోదా శాసనపీఠికలు గలిగి వెలువడుచుండును.

6. విజయాభిషేకము: వెల రు.2-00, కృతికర్త శ్రీ జ్ఞానానందకవిగారే!

వీరి రచనలలో ననేకము లాంధ్ర మంత్రుల కంకితములు గావింపబడినవి.

7. పద్యలేఖావళి :- వెల 0-50. కృతికర్త శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునకవిగారు. ఈపొత్తమున నాత్మీయబంధుమిత్రులనడుమ తేలికమాటలతో వ్రాయబడిన పద్యలేఖలు ముద్రితములైనవి.

ఆంధ్రీకరణార్థము

శ్లో॥ ప్రాలేయాచలవ న్మహోన్నతతమా
గాంగాంబువ త్పావనా
గంభీ రాంబుధివ త్సురాలయగవీ
వ త్కామితార్థప్రదా
శౌరే ర్దర్శనవ త్సదార్చనకలా
లభ్యా ఽభ్రవ ద్వ్యాపినీ
స్వర్భూవ ద్విబుధాశ్రితా వసతు మే
గీర్వాణగీ రానసే."

(కవిమూర్ధన్యకృత వ్యాజవ్యాహారే)

సమస్యాపూరణార్థము

"ఉ. తాళము సాళగింప వడి
దాకెను భార్గవు డంత రాఘవున్."

*కవీంద్రులారా! మీచే లిఖితము లగు పై విషయములు మాఘమాసాంతము దాటకుండ బంప బ్రార్థితులు.

సంపాదకుడు.

అత్ర గజతావంతం తత్తాదృగశ్వబలం తాదృగ్భటపరీత మపి మాం జయలక్ష్మీ ర్న వృణుతే ఇతి వివక్షిత స్సంబంధో న సంపూర్ణః. ఉదాహరతి సంపాది తేతి. గజతా గజసమూహాః మే మయా హేలయా అభిభూత స్తిరస్కృత శ్శమనో యమో యై స్తైః కలహే యుద్ధే జయశ్రీ ర్జయలక్ష్మీః యోజయతి. అత్రేతి.

పతత్ప్రకర్షమ్

శ్లో॥ పతత్ప్రకర్షం త త్ప్రాహుః, ప్రకర్షో యత్ర విశ్లథః ॥

పతత్ప్రకర్షం లక్షయతి పతత్ప్రకర్ష మితి విశ్లథః భ్రష్టః యథా

శ్లో॥ కస్మా ద్దేశా దాగత స్త్వమ్, వనే పాంచాలభూపతే!

పాంచాలా త్ప్రాంచితభటా ద్ధావదశ్వా ద్బృహద్గజాత్ ॥

అత్ర! ప్రకృష్టవిశేషాణాం వ్యత్యాసేన కథనా త్పతత్ప్రకర్షతా ఉదాహరతి కస్మా దితి. అత్ర భటాద్యపేక్షయా గజానాం ప్రకృష్టత్వా త్పూర్వ ముపాదానం భటాదీనాం పునరపకృష్టత్వా త్పశ్చా దేవోచితం తథాపి భటాదీనాం పూర్వ ముపాదానే ప్రకర్షభ్రంశా త్పతత్ప్రకర్ష మితి భావః ॥

అపదస్థసమాసమ్

శ్లో॥ అపదస్థసమాసం త, త్సమాసో యత్ర నోచితః ॥

అపదస్థసమాసం లక్షయతి. అపదస్థసమాస మితి పదస్థానం అస్థానస్థ సమాస మిత్యర్థః. యథా.

శ్లో॥ తిగ్మప్రభావా ఇవ శత్రుభూపా
దావాంబుభూమీలదురాపరూపాః
నిరాకృతా వారిభృతేవ రాజన్!
గాంగేయబద్ధత్సరుణాసినా తే.

అత్ర శత్రురాజవిశేషణే అస్థానే సమాసః. అయం చ భీషయితరి ప్రయోక్తవ్య ఏవ. న తు భీషయే ష్వితి అపదస్థసమాసం.

ఉదాహరతి తిగ్మేతి. ప్రాగ్వ్యాఖ్యాతః. అస్థానసమాసత్వం దర్శయతి. అత్రేతి. ఇతి వాక్యదోషాః

అథార్థదోషాః

శ్లో॥ అహేతువ్యాహతగ్రామ్యాశ్లీలా స్సహచరచ్యుతం
అక్రమానుచితాపార్థన్యూనాసిద్ధోపమా దశ.

వాక్యదోషనిరూపణానంతరమర్థదోషా న్వక్తు ముద్దిశతి. అహే త్విత్యాదినా.

అహేతుః

శ్లో॥ హేతో ర్వినార్థకథన మహేతు రితి కథ్యతే.

అర్థై లేషా ముద్దేశానుసారేణ లక్షణోదాహరణా న్యాహ. హేతో రితి. హేతో ర్వినా హేతునా వినేత్యర్థః. పృథగ్వినేత్యాదినా పంచమీ యథా

శ్లో॥ దూరేఽవతీర్య జననా ద్యవనక్షితీంద్రో
బాహాగ్రఖడ్గలతికాం పురతో నిధాయ
జానుద్వయేన పృథివీ ముపవిశ్య శశ్వ
చ్ఛృంగాటకే ద్యుతల ఏవ దృశా విధత్తే.

అత్ర ఆనందకరహిమకరసేవనేచ్ఛ యేతి హేత్వనుక్తే రహేతుః. ఉదాహరతి దూర ఇతి. యవనక్షితీంద్రః దూరే జననా దశ్వా దవ తీర్య బాహాగ్రే హస్తే స్థితాం ఖడ్గలతికాం పురతో ధురి నిధాయ శృంగాటకే చతుష్పథే "శృంగాటక చతుష్పథ" ఇ త్యమరః. జాను ద్వయేన జానుభ్యాం శశ్వ న్ముహుః. పృథివీ ముపవిశ్య ద్యుతల ఏవ దృశా విధత్తే. దివం పశ్యతీ త్యర్థః. అత్ర హేతు ర్నోక్త ఇత్యాహ అత్రేతి.

వ్యాహతం

శ్లో॥ వ్యాహతం దేశకాలాదివిరుద్ధం బహుధోచ్యతే.

వ్యాహతం లక్షయతి వ్యాహత మితి. దేశకాలాదీత్యాదిశబ్దేన విద్యా స్వభావాదయో గృహ్యంతే. వ్యాహతం విరుద్ధ మిత్యర్థః- యథా

శ్లో॥ సౌఖ్యాయ ద్వయ మేవాత్ర కౌబేరో మలయానిలః
వర్షార్ధరాత్రనిర్నిద్రపుష్కరం విమలం సరః.

అత్ర పూర్వార్ధే కౌబేరో మలయానిల ఇతి దేశవిరోధః, ఉత్తరార్ధే కాలవిరోధః. దేశకాలవిరోధా వుదాహరతి సౌఖ్యాయేతి. అత్ర దేశే ద్వయ మేవ సౌఖ్యాయ భవతీ త్యర్థః. కిం తద్ద్వయ మిత్య త్రాహ. కౌబేరః ఉత్తరదిశ్యః మలయానిలః వర్షాసు వర్షాకాలే అర్ధరాత్రే చ నిర్నిద్రాణి వికసితాని పుష్కరాణి పద్మాని యస్మిన్ తత్ విమలం దోషరహితం చ సరః. విరోధం దర్శయతి అత్రేతి. మలయానిలః కౌబేర ఇతి దేశవిరోధః. పద్మానాం వర్షార్ధరాత్రయో ర్వికసనాభావా త్కాలవిరోధ శ్చే త్యవగంతవ్యమ్. ఏవ మన్యేపి ద్రష్టవ్యాః.

గ్రామ్యమ్

శ్లో॥ పామరచ్ఛాందసోక్తిభ్యాం తద్గ్రామ్యం పరికీర్త్యతే.

గ్రామ్యం లక్షయతి పామరేతి. పామరోక్తి శ్ఛాందసోక్తి శ్చేతి గ్రామ్యం ద్వివిధ మిత్యర్థః.

పామరోక్తిః

శ్లో॥ భవా నివ శ్వపాంచాల సమ్యగోహ మిహాహవే
గళగ్రాహం గృహీతో భూ ద్భత తేన ససత్వరమ్.

పామరోక్తి ముదాహరతి భవా నితి-

ఛాందసోక్తి ర్యథా

శ్లో॥ కరవాలబిడాలో యం భూపాల! తవ వైరిణాం
యశఃపయః పిబ త్యాశు త్రిలోకీభాండసంస్థితమ్.

ఉదాహరతి కరవాలేతి. కరవాల ఏవ బిడాలః. త్రిలోక్యేవ భాండ స్తత్ర సంస్థితం యశ ఏవ పయః. ఛాందసత్వం స్పష్టమ్. యథా వా

శ్లో॥ ఆశామోహాదుకూలాని రిపుకీర్తిమయాని వో
ఛిద్యంతే రాజసైన్యానాం కరవాలాగ్రమూషకైః.— స్పష్టమ్

శ్లో॥ సంఘీకరణకౌశల్యే స్వీయానా మన్వయంచనే
ద్విపాదో వాలరహిత స్సృగాలః కోంకణప్రభుః,
పరిహాసాస్పదత్వేన పునః పున రుదాహరతి సంఘీకరణేతి స్పష్టం.

అశ్లీలం

శ్లో॥ అశ్లీలార్థస్య కథన మశ్లీలం పరికీర్త్యతే.
అశ్లీలం లక్షయతి అశ్లీలేతి. అశ్లీలార్థస్య అమంగళజుగుప్సావ్రీడబుద్ధి జనక స్యైత్యర్థః. అత్ర పర్యాయై ర్వ్యస్యార్థస్య సువచత్వా త్పదవిని మయాసహిష్ణోః పదదోషా దశ్లీలా దముష్య భేద ఇతి బోధ్యమ్-యథా

శ్లో॥ దృష్ట్వా కామోద్ధితం ప్రాంశురవిమూఢా స్స్మరకేతనం
అత్తు మిచ్ఛంతి సంగృహ్య విపక్షనృపయోషతః.
అత్ర వ్రీడాకరార్థప్రతీతి జనకత్వా దశ్లీలం.
ఉదాహరతి దృష్ట్వేతి. విమూఢా అత్యంతవివేకహీనాః విపక్షనృప యోషితః కామోద్ధిత ముల్లాసే నోద్ధితం తారుణ్యజస్యేన కామే నోద్ధితం చ. ప్రాంశుం మహాంతం దీర్ఘం చ స్మరకేతనం మత్స్యం కామ ధ్వజం చ దృష్ట్వా సంగృహ్య, అత్తుం భోక్తుం రంతుం చ ఇచ్ఛంతి. అశ్లీలత్వం యోజయతి అత్రేతి;

సహచరచ్యుతం

శ్లో॥ హీనై స్సహై వోత్కృష్టానాం పాఠ స్సహచరచ్యుతమ్.
సహచరచ్యుతం లక్షయతి హీనై రితి. యథా

శ్లో॥ వ్యాధః కోకకులై ర్మహీధరగుహా స్సింహై ర్విషాణై ర్ఘనైః
కాంతారోద్భవకాసరాః పికబలై ర్వృక్షో రసాలాహ్వయః
దంతై ర్మత్తమతంగజా స్త్వమపి చ క్షోణీపతే మాళవ!
నిర్వ్యాజోపనతై ర్నిసర్గమధురై రాశ్రీయ్యసే సద్గుణైః

ఉదాహరతి వ్యాధ ఇతి. కోకకులైః వృకసమూహైః "చక్రవాకే వృకే కోక" ఇతి రత్నమాలాయాం. వ్యాధః మృగయుః సింహై ర్మహీధర గుహాః ఘనై ర్దీర్ఘై ర్వ్యాఘ్రై శ్శృంగైః, కాంతారోద్భవా వన్యాః, కాసరా మహిషాః. "లులాయో మహిషో వాహ ద్విషత్కాసర సైరిభా" ఇత్యమరః. పికాః కాకాః. "పికః కాకే కోకిలేచేతి విశ్వః. తేషాం బలై స్సముదాయైః రసాల శ్చూతః. "ఆమ్ర శ్చూతో రసాలోసౌ" విత్యమరః. దంతై ర్మత్తమతంగజాః. అత్ర వ్యాధాదిభ్యో మాళవ భూపతేః కోకాదిభ్య స్సద్గుణానాం చ సర్వోత్కృష్టత్వా త్తత్వాత్తేన సహచరత్వ్యతమ్.

అక్రమం

శ్లో॥ ఉచ్యతే క్రమవాచ్యార్థవ్యుత్క్రమో క్రమనామకః.

అక్రమం లక్షయతి ఉచ్యత ఇతి- యథా

శ్లో॥ కస్మా ద్దేశా దాగత స్త్వం వనే పాంచాలభూపతే !

పాంచాలా త్పాంచితభటా ద్దావదశ్వా ద్భ్రమద్గజాత్.

ఉదాహరతి కస్మా దితి. వ్యాఖ్యాతో ఽయం ప్రాక్ వాక్యత్వే ప్యస్య అర్థపరిక్రమవ్యుత్క్రమా దపక్రమత్వ మి త్యవగంతవ్యమ్.

అనుచితం

శ్లో॥ య దయోగ్యస్య కథనం త దే నానుచితం విదుః

అనుచితం లక్షయతి య దితి. అయోగ్యస్య అవర్ణనీయస్య- యథా.

శ్లో॥ ఆకీర్ణకై శిక ముదంచితకంప ముద్య
త్స్వేదం భయా దగణితాపగతో త్తరీయం
రాజ్యం విహాయ విపినే చరితారికాంతా
వ్యాధా వలంతి కుసుమే ష్వనువిద్ధచిత్తాః.

అత్ర భయేన పలాయితాసు శత్రుకాంతాసు వ్యాధానాం రిరంసా వర్ణనా దనుచితం. ఉదాహరతి ఆకీర్ణకైశికం పర్యాకుల కేశపాశం

కుసుమేషుణా మదనేన అనువిద్ధం చిత్తం యాసాం తాః, యోజయతి అత్రేతి. రిరంసా రంతుమిచ్ఛా.

అపార్థం.

శ్లో॥ సముదాయార్థశూన్యం య దపార్థం త త్ప్రకీర్త్యతే.

అపార్థం లక్షయతి సముదాయేతి- యథా.

శ్లో॥ కాంభోజాః కనకాంభోజాః కుంతలాః కీర్ణకుంతలః,

విశ్వం విశ్వంభరక్ష్మా త్తం కాచి త్కాంచి న్మదం దదౌ.

అత్ర దశదాడిమాదివ దర్థశూన్యత్వా దపార్థతా,

ఉదాహరతి కాంభోజ ఇతి. యోజయతి అత్రేతి.నిరర్థకత్వా దపార్థతా.

హీనోపమం

శ్లో॥ యత్రోపమానం హీనం స్యా త్తద్ధి హీనోపమం మతం,

హీనోపమం లక్షయతి యత్రేతి. జాతిప్రమాణాభ్యా ముపమానస్య హీనత్వం హీనోపమం. అతఏవ పూర్వోదాహృతాభ్యాం న్యూనాధికోపమాభ్యా మస్య వక్ష్యమాణస్య అధికోపమస్య చ భేదోఽవగంతవ్యః, యథా,

శ్లో॥ పాటవం మ్లేచ్ఛవీరాణాం రిపువిద్రావణే న చేత్

అశ్వానుధావనే శక్తిః కాసరాణాం చ నో భవేత్.

అత్ర మ్లేచ్ఛవీరాణాం సైరిభై స్సహ వ్యంగ్యౌపమ్యం హీనం.

జాతిహీనోపమ ముదాహరతి పాటవ మితి. యోజయతి అత్రేతి.

అసిద్ధోపమం

శ్లో॥ అప్రసిద్ధోపమానం య త్త దసిద్ధోపమం మతం.

అసిద్ధోపమం లక్షయతి అప్రసిద్ధేతి స్పష్టమ్- యథా,

శ్లో॥ త్రాటకావ దదభ్రాంగ్యో హంసీవ దణుమధ్యమాః

కోకీవ న్మధురాలాపా రాజంతే కుకురస్త్రియః.

ఉదాహరతి తాటకావ దితి,అదభ్ర మనల్పమంగం శరీరం యాసాం తాః,

"అంగాదిభ్య శ్చేతి జ్ఞిప్". కోకీవ ద్వ్యకాంగనావత్. "వృకకోకిల యోః కోకః" ఇతి మాధవః. కుకురస్త్రియః కుక్కుటాంగనాః.

అన్యే చ కేచన దోషా ఉదాహ్రియంతే

నిరలంకారః

శ్లో॥ అలంకారేణ రహితో నిరలంకార ఉచ్యతే.

నిరలంకారం లక్షయతి అలంకారేణేతి.— యథా.

శ్లో॥ అహో! విపక్షసౌధేషు ముహు రాఘ్రాయ మేదినీం
ఉద్ధృత్యైకపదం శ్వానో మూత్రం ముంచంతి పశ్యథ.

అత్ర న కశ్చి దలంకారః. న స్వభావోక్తి రస్తీతి వాచ్యం శ్లాఘ్య విశేషణాభావాత్. ఉదాహరతి అహో ఇతి. యోజయతి అత్రేతి.

అధికోపమం

శ్లో॥ యత్రోపమాన మధికం తద్భవే దధికోపమం.

అధికోపమం లక్షయతి యత్రేతి. హీనోపమవ జ్జాతిప్రమాణాభ్యా ముపమాన స్యాధిక్య మధికోపమం,—యథా

శ్లో॥ సముల్లసితై స్సారమేయై శ్శబరా యాంతి సంవృతాః
గజారిశిశుభి ర్లగ్నాః పాదా ఇవ మహీభృతాః.

అత్ర సారమేయై స్సహ ప్రతీయమానం సింహకిశోరసామ్య మధికం. ఉదాహరతి సముల్లసితై రితి. సముల్లసితై స్సారమేయైః కుక్కురైః సంవృతాః స్సంత శ్శబరా మ్లేచ్ఛజాతివిశేషాః "గోమాంస భక్షకో యస్తు లోకబాహ్యం చ భాషతే సర్వాచారవిహీనోఽసౌ మ్లేచ్ఛ ఇత్యభిధీయతే" భేదాః కిరాతశబరపుళిందా మ్లేచ్ఛజాతయః" ఇ త్యమరకోశాదయః గజారిశిశుభి స్సింహకిశోరైః "కంఠీరవో గజరిపుః సింగదృష్టి ర్మృగాధిపః, బాలః కిశోర" ఇతి చామర ,, అత్ర యద్యపి కిశోరపదం "బాలం కిశోర" ఇత్యమరకోశే హయకిశోరపర్యాయత్వేన వ్యాఖ్యాతం. తదపి సామాన్యేన సర్వబాలపరత్వే ప్రయోగ

బాహుళ్యా న్న, దోషః. లగ్నా మహీభృతాం పాదా ఇవ యాంతి.
యోజయతి అత్రేతి.

అసదృశోపమం

శ్లో॥ య దతుల్యోపమానం స్యా త్త ద్భవే దసదృశోపమం

అసదృశోపమం లక్షయతి. అసదృశోపమాన మసదృశోపమం-యథా

శ్లో॥ భాతి కాంభోజభూజాని స్సంవృతో ద్యత్తురంగమః
ఇందిందిరసమాక్రాంత సరోరుహసరో యథా.

ఉదాహరతి భాతీతి, కాంభోజభూపతిః న హ్యత్ర కాంభోజభూపతి
సరసో స్తద్ధర్మయో శ్చ సాదృశ్యప్రసిద్ధిః. నచ ధర్మిణో ర్ధర్మద్వారా
సాదృశ్యం. ధర్మయో శ్చ ధర్మిద్వారేతి వాచ్యం. ఇతరేతరాశ్రయ
త్వప్రసంగాత్ యథాహ "బధ్నామి కావ్య శశినం వితతార్థరశ్మి"
మిత్యత్ర వామనః. తదేవ మితరేతరాశ్రయదోషో దురుత్తర ఇతి.

వ్యర్థం.

శ్లో॥ యత్ప్రయోజనశూన్యం స్యా ద్వ్యర్థం త త్పరికీర్తితం

వ్యర్థం లక్షయతి యదితి- యథా.

శ్లో॥ కోసలేంద్రపురావాసో నదీంద్రోర్వ్యంతరే ద్విజః
సవై స్రజశ్చ రచయే త్కథం స న కవి ర్భవేత్.

అత్ర కవితాసంపాదనే నదీతర్కాదిక మప్రయోజకం

ఉదాహరతి కోసలేతి-యోజయతి అత్రేతి. ఏవ మన్యేపి దోషా
స్త్వన్యతో ద్రష్టవ్యా ఇతి విరమతి. ఇత్యర్థదోషా ఇతి. ఇతి అర్థ
దోషాః. అథ దోషాపవాదః

శ్లో॥ సర్వే ప్యేతే నుకరణే న దోషాః పరికీర్తితాః
నావతీతస్య దోష స్స్యా చ్ఛాస్త్రార్థప్రకాశనే.

సంపాదకీయము

వెనుకటిసంచికలో ప్రచురితము లగు శ్లోకమున కాంధ్రానువాదమును, సమస్యకు బూరణమును గొంద ఱాంధ్రపండితకవులు లిఖించి పంపినందుల కెంతయు గృతజ్ఞులము.

ఆంధ్రానువాద మొనరించిన కొందఱి పద్యరచనలలో, గోరబడిన "మా" శబ్దశ్లేష లోపించినది. ఐనను వారిపద్యములుగూడ స్వీకరించి ప్రచురించడమైనది. భావిరచనలలో సూచితనియమావళి బాటింపఁ బ్రార్థితులు. ప్రకటితపద్యముల బఠించి యందలి సారస్య వైఖరుల నిర్ధరించు నధికారము మాసాహితీరసికపాఠకనికరమందే ప్రస్థాపింపబడినది.

రచయితల నామధేయములు లేకుండ రెండు మూడాంధ్రానువాదములుమాకు పంపబడినవి. అనువాదములు చక్కగ నుండుటచే వానినిగూడ బ్రకటీకరించితిమి.

ఈ సంచికయందుగూడ గతమందున లెనే శ్లోకమును సమస్యయు నొసంగబడినది. పండితకవివరులు స్వీకరించి పూరించి సకాలమున రచనల బంప నర్థించుచుంటిమి. ఆలసించి పంపబడిన యిరువురుకవుల గత రచనల ముద్రితములైనవి. కారణ మావిషయమంతకుమున్నే ముద్రిత మగుటచేతనే కాని యన్యముగాదు.

గ్రామ్యవ్యావహారిక భాషానిరాకృతియు, పరిశుద్ధప్రసిద్ధ గ్రాంథిక భాషోద్ధరణవ్యాపృతియు మా యాంధ్ర సాహిత్య పరిషత్ప్రధానాశయములు. కావున వ్యాసరచయితలు దయతో నైజగద్యపద్యరచనలలో విసంధుల బర్యుదాసించి, వ్యావహారికపదప్రయోగముల బరిహరించి రసవంతముగ, మితముగ విస్పష్టాక్షరకలితముగ బత్త్రముల వ్రాసి పనుప బ్రార్థన.

సంపాదకుడు : కాకరపర్తి కృష్ణశాస్త్రి
(కవికంఠీరవ, కవిమూర్ధన్య, ప్రౌఢకవిచంద్ర,
విద్వత్కవివర, బ్రాహ్మీభూషణ)

ప్రాస్తావిక పద్యావళి	0–75
బాలభారతము (అగస్త్యకృతమునకుఁ దెలుగు)	2–50
బాలరామాయణము	0–25
మాధ్యమిక కారికలు–సంస్కృతము–నాగరిలిపి	2–50
యుద్ధమల్లుని బెజవాడ శిలాశాసనము	1–0
రఘునాథ రామాయణము (ప్రథమ భాగము)	1–00
రాధికాసాంత్వనము– సముఖము. వేంకటకృష్ణప్పనాయకుఁడు	1–50
రాఘవయాదవీయము	1–00
రెడ్డినాఁటి రెండు శాసనములు	0–50
లక్షణసారసంగ్రహము	2–00
విప్రనారాయణచరిత్రము– చదలవాడ మల్లన్న	1–25
శతకసముచ్చయము (ద్వితీయ భాగము)	1–25
శాసనపద్యమంజరి (మొదటిభాగము)	1–75
,, (ద్వితీయ భాగము)	0–75
శివరాత్రి మహాత్మ్యము– శ్రీనాథకవి	2–50
షోడశకుమారచరిత్రము– వెన్నెలకంటి అన్నమయ్య	1–25
సర్వేశ్వరశతకము– యథావాక్కుల అన్నమయ్య	0–25
స్వప్నవాసవదత్త – భాసకృతి కనువాదము	2–00
సింహాసనద్వాత్రింశిక – కొఱవి గోపరాజు	1–50
,, (ద్వితీయ భాగము)	1–50
సీతారామచరిత్రము	1–00
హంసవింశతి	0–50
42 – వార్షిక మహాసభ – వ్యాసములు – 250 పుటలు	1–50

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

*1	సంపుటము	15-00
*2	"	15-00
3	"	15-0
4	"	15-0
5	"	15-0
6	"	15-0
7	"	15-0

* పునర్ముద్రితము గానున్నవి.

ప్రతులకు :

ఆంధ్ర సాహిత్య పరిషత్తు

రామారావు పేట

కాకినాడ

తూర్పుగోదావరిజిల్లా.

Edited by K. Krishnasastry, Published by Andhra Sah Parishat and Printed by J. Gopalam at Republic Pr MainRoad, Kakinada.